సీతానగరంలో పదోతరగతి పరీక్షా కేంద్రం ఎత్తివేత

జోగమ్మపేటలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకులంలో నూతన పరీక్షా కేంద్రం ఏర్పాటుకు అదేశాలు జారీ

విశాలాంధ్ర - సీతానగరం : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎన్నోయేళ్ళుగా నడుస్తున్న పదోతరగతి పరీక్షకేంద్రంను ఈఏడాది జిల్లా అధికారులు ఎత్తి వేశారు. దీనిస్థానంలో కొత్తగా జోగమ్మపేటలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకులపాఠశాలలో ఏర్పాటు చేస్తూ విద్యాశాఖ అధికారులు ఉత్తర్వులు జారీచేశారు. ఈనెల 17నుండి పదోతరగతి పరీక్షలు జరగనున్న నేపథ్యంలో పరీక్షా పత్రాలురాగా పోలీస్ స్టేషన్లో భద్ర పరిచారు. మండలంలోని సీతానగరం, మరిపివలస, బూర్జ, గాదెలవలస, ఆర్ వెంకంపేటలలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, జోగమ్మపేటలో ఉన్న ప్రతిభ కళాశాల, సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాల, కేజీబీవితోపాటు సీతానగరంలో హెూలీ క్రాస్ స్కూల్ విద్యార్థులు పదో తరగతిపరీక్షలు రాయనున్నారు. వీరికోసం మండలంలోని మూడు పరీక్షాకేంద్రాలను ఏర్పాటు చేశారు. జోగమ్మపేటలోని ప్రతిభా కళాశాల, డాక్టరు బి ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల, బూర్జ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి పరీక్షలు నిర్వహణకు ప్రభుత్వం అదేశాలు జారీ చేసింది. ఈపరీక్షా కేంద్రాలకు చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట మెంటు అధికారులను నియామకం చేశారు. ఫర్నిచర్ పేరుతో సెంటర్ నిలిపివేయడం సమంజసమే అయినప్పుడు 6వతరగతి నుండి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు క్రింద కూర్చొని పాఠాలు నేర్చుకోవడం కూడా ఎంతవరకు సమంజసమని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. అటువంటి సమయంలో అధికారులు పాఠశాలను కూడా ఎత్తివేయడం మంచిదేమోనని ఆలోచన చేయాలి. ఇప్పటికైనా అధికారులు, పాలకులు, తల్లిదండ్రులు దృష్టి సారించి మండల కేంద్రంలోని ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని అంతా కోరుతున్నారు. దీన్ని సీరియస్ గా తీసుకొని పాఠశాలలో విద్యార్థులు క్రింద కూర్చోకుండా తగు చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు. మండల కేంద్రంలోని రాజకీయ ప్రముఖులు ప్రజాప్రతినిధులు పెద్దలు దీనిని ఒకసారి పరిశీలించి వచ్చే ఎడాదైనా పరీక్షాకేంద్రం ఏర్పాటు చేసేందుకు పాఠశాలల్లో అత్యంత అవసరమైన ఫర్నిచర్ ఏర్పాటు చేయడంలో ప్రత్యేక దృష్టి సారించాలని, దీనిని ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లే చర్యలు చేపట్టాలని తల్లిదండ్రులు విద్యార్థిని విద్యార్థులు వేడుకుంటున్నారు.

ఉత్తమ ఉద్యోగ అవార్డుల ప్రదానం

విశాలాంధ్ర - గుమ్మలక్ష్మీపురం : ప్రపంచ మహిళా దినోత్సవ సందర్భంగా పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ మాధవరెడ్డి ఐ.పీ.ఎస్ చేతుల మీదుగా జిల్లా ఉత్తమ మహిళ ఉద్యోగిగా అవార్డు అందుకున్న కానిస్టేబుల్ తిమ్మక మాలతి. ఎల్విన్ పేట సర్కిల్ ఇన్స్పెక్టర్ బి.హరి, సబ్ ఇన్స్పెక్టర్ బి.శివప్రసాద్ సలహాలు సూచనలతో గుమ్మలక్ష్మీపురం పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న మహిళ విద్యార్థులకి, మహిళలకు మహిళ చట్టాలపై అవగాహన కల్పించడం మరియు మహిళా విద్యార్థులకి కెరీర్ గైడెన్స్ వంటి సదస్సులు నిర్వహించినందుకు ఈ అవార్డు ఇవ్వడం జరిగింది.

10 నుంచి గ్రామ దేవత పండుగ

విశాలాంధ్ర - మక్కువ : మన్యం జిల్లా మక్కువ మండలంలోని సిబిల్లి పెద్ద వలస, గ్రామంలో గిరిజనుల ఆరాధ్య దేవత కోరికలు తీర్చే కల్పవల్లి శ్రీ గంగమ్మ తల్లి పండగను ఈనెల 10 11 12 తేదీలలో గ్రామ దేవత పండగను పెద్దలు నిర్ణయించడం జరిగినది. ఈ గంగమ్మ తల్లి పండగ సందర్భంగా గ్రామంలో శ్రీ గంగమ్మ తల్లి ఘటాలను మేళ తేలాలతో మందుకొండ సామాగ్రితో అట్టహాసంగా అమ్మవారిని ఊరేగింపు కార్యక్రమం జరుగుతున్నాయి. ఈ గ్రామ దేవత కమిటీ సభ్యులు సర్పంచ్ , పూడి తిరుపతిరావు, మాజీ సర్పంచ్ లు తీళ్ల కిరణ్, పూడి శ్రీనివాసరావు మరియు రివిన్నాయుడు వేమల లక్ష్మణరావు వేముల మన్మథరావు వేమల చిన్న రావు,, తేలుకోటి వేముల పైడివినాయుడు పండగ తేదీలను తెలియపరిచారు.

సర్పంచ్ చెక్ పవర్ రద్దు సరే బాధ్యులైన కార్యదర్శులపై చర్యలు తీసుకోరా..?

విశాలాంధ్ర - సీతానగరం : మండలంలోని జోగంపేట గ్రామపంచాయతీలో 33లక్షల రూపాయల నిధులు దుర్వినియోగం జరిగినట్లు జిల్లా పంచాయతీ అధికారి నిర్ధారించడంతో సర్పంచ్ చెక్ పవర్ ను రద్దు చేసిన సంగతి తెలిసిందే. సర్పంచ్ తో పాటు దీనికి బాధ్యులైన అప్పట్లో పనిచేసిన పంచాయతీ కార్యదర్శులపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా దీనికి బాధ్యులైన పంచాయతీ కార్యదర్శులపై చర్యలు తీసుకొని సస్పెండ్ చేయాలని గ్రామంలోని ప్రజలు, నాయకులు, యువకులు డిమాండ్ చేస్తున్నారు. దీనిపై జిల్లా కలెక్టర్‌ను కలిసి నివేదిస్తామని వారు తెలిపారు.

10న కలెక్టరు కార్యాలయం వద్ద ధర్నా

విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్ : ఈ నెల 10వ తేదీన స్థానిక జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద తలపెట్టిన ధర్నాను విజయవంతం చేయాలని ప్రజా సంఘ నాయకులు కోరారు.ధర్నా నిర్వహిస్తున్న సందర్భంగా కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మథరావు అధ్యక్షులు దావాల రమణారావు, కోశాధికారి గొర్రెల వెంకటరమణ, మాట్లాడుతూ ఇటీవల కాలంలో మన్యం జిల్లాలో చిరు ఉద్యోగస్తులపైన రాజకీయంగా కక్ష సాధిస్తూ వాళ్ల పట్టకూడదు వాళ్ల కుటుంబాల్ని రోడ్డుపై నట్టేస్తున్నారు బలిసిపేట మండలం అరసాడ హైస్కూల్లో ఎలిమెంటరీ స్కూల్లో కొమరాడ మండలం కోటిపాము హైస్కూల్లో మరియు వివో ఏలు పైన డైలీ వేజ్ పైన సాధింపులు భాగంగా తొలగించడం అన్యాయం తొలగించిన వారిని చేర్చుకోవాలి అని కోరారు. అలాగే గ్రామ వార్డు సచివాలయం వాలంటీర్లకు న్యాయం చేస్తానని 10 వేల రూపాయలు వేతనం ఇస్తామని నమ్మబలికి వాళ్లకి ద్రోహం చేసింది కూటమి ప్రభుత్వం కావున తొలగించిన స్కీమ్ వర్కర్లు ఉద్యోగస్తులను నియమించాలని హైకోర్టు ఆర్డర్ ప్రకారం బలిజిపేట మండలం అరసాడ హైస్కూలు ఎలిమెంటరీ స్కూల్ వంటమ్మలు స్కూల్ స్వీపర్లు పాతవారిని కొనసాగించాలి హైకోర్టు ఉత్తర్వులను కూడా ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవాలని చెప్పి పదో తేదీన కలెక్టర్ ఆఫీస్ దగ్గరిజరుగు ధర్నాని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సూరిబాబు, తులసి, రాజు, డేవిడ్ పాల్గొన్నారు.

సమాచారం లేకుండా కుళాయిల తొలగింపు అన్యాయం : పట్టణ పౌర సంఘం

విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్ : ముందస్తు సమాచారం ఇవ్వకుండా నీటి పన్ను కట్టలేదన్న కారణంగా త్రాగునీటి సరఫరా అవుతున్న కొళాయి కనెక్షన్లను తొలగించడం అన్యాయమని పట్టణ పౌర సంక్షేమ సంఘం కార్యదర్శి పాకల సన్యాసిరావు ఆరోపించారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో డమ్మీచేసిన కుళాయిలు విషయంపై ఆయన స్పందించారు. దశాబ్దకాలంగా పార్వతీపురం మున్సిపల్ త్రాగునీరు వ్యవస్థ నిర్వీయం అయ్యిందని, కుళాయినీళ్ళు ఎన్నిరోజులకు వస్తాయో! ఏ సమయంలో వస్తాయో! ఎవరికి తెలియదని, పైగ బురదనీళ్ళు రంగు మారిన నీళ్ళు వంటి ఎన్నో సమస్యలతో సతమతమౌతు ప్రజలకు నీటిపన్నులు చెల్లించకపోతే కుళాయిలకు డమ్మీలు వేస్తామనడం పన్నుదారులపై కంఠసంగా మాట్లాడటం సబబుకాదని అన్నారు. పట్టణ ప్రజల త్రాగునీరు సమస్య పరిష్కారం కోసం ప్రభుత్వం వారు మంజూరు చేసిన 67 కోట్ల రూపాయలు సమగ్ర మంచినీటి పథకం నిధులతో సమస్య పరిష్కారం చేయాలని, మున్సిపల్ చట్టం ప్రకారం అత్యవసర సర్వీసులను నిలిపి వేసే ముందు సంబంధిత యజమానికి నోటీసు ఇవ్వాలన్నా జ్ఞానం కూడా అధికారులకు లేదా అని ప్రశ్నించారు.

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

విశాలాంధ్ర - బెలగాం : పార్వతీపురం మండలం అడ్డాపుశీల పంచాయతీ మెట్టవలస గ్రామంలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా అఖిల భారత వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.సంగం ఆధ్వర్యంలో అఖిల భారత ప్రగతిశీల మహిళా సంఘం నాయకులు మహిళలపై అణిచివేత అత్యాచారాలకు వ్యతిరేకంగా పోరాడుదామని సూపర్ సిక్స్ పథకాలు వెంటనే అమలు చేయాలని, మనువాద సంస్కృతి మాకొద్దు, మహిళలకు ఎన్నో చట్టాలు వచ్చినా రక్షణ లేదు భద్రత లేదు, ఉద్యోగం చేయాలన్నా భయం, రోజూ కాలేజీకి వెళ్ళాలన్నా భయం, మహిళలకు ఉద్యోగ భద్రత కల్పించాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, పురుషులతో సమానంగా మహిళలకు హక్కులు కల్పించాలని, అలాగే ఈ మధ్యకాలంలో పశ్చిమ బెంగాల్లో ప్రభుత్వ డాక్టర్ అయిన మహిళను సిబ్బంది అంతా ఉన్నా సిసి కెమెరాలున్నా ఒక మహిళను మానభంగం చేసి హత్య చేశారని, ఈ మధ్యకాలంలో ఒక భర్త భార్యను నరికి కుక్కర్లో ఉడకపెట్టిన పరిస్థితి ఉందని రాబోయే భవిష్యత్తులో అందరూ కలిసి పోరాటానికి సిద్ధం కండి అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అఖిలభారత ప్రగతిశీల మహిళా సంఘం నాయకులు వి. లక్ష్మి, ఎ.మంగమ్మ, ఎ.శాంతమ్మ, ఎ.సుబ్బమ్మ, జి.ఆదిలక్ష్మి, జి. అంజలి, ఎ.పద్మ, ఎ.పుష్ప, ఆర్.గౌరమ్మ, ఎల్. పార్వతి తదితరులు పాల్గొన్నారు.

రేపు పింఛనుదారుల నెలవారీ సమావేశం

బెలగాం : పార్వతీపురం సబ్ ట్రెజరీ పరిధిలో గల పింఛనుదారుల నెలవారీ సమావేశం సోమవారం ఉదయం 10-00 గంటలకు స్థానిక బెలగాం రైతు బజారు వెనుక గల ప్రభుత్వ పింఛనుదారుల సంఘ భవనంలో నిర్వహించడమగునని పార్వతీపురం రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ కార్యదర్శి డి. గణపతిరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమావేశంలో లైఫ్ సర్టిఫికేటు ఆదాయ పన్ను మొదలగు వాటి వివరములు చర్చించబడునని కావున పింఛనుదారులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రభుత్వం మహిళలకు పెద్దపీట వేస్తుంది : రాష్ట్ర ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి

విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్ : రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు పెద్ద పీట వేస్తుందని, రాష్ట్ర బడ్జెట్ లో రూ.4,332 కోట్లు కేటాయించడమ ఇందుకు నిదర్శనమని రాష్ట్ర ప్రభుత్వ విప్ మరియు కురుపాం శాసనసభ్యులు తోయక జగదీశ్వరి పేర్కొన్నారు. మహిళా,శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు స్థానిక టిటిడి కళ్యాణ మండపంలో శనివారం జరిగాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, ఉన్నతమైన స్థానాల్లో నిలిచారని ఆమె గుర్తుచేస్తారు. భారత రాష్ట్రపతి, రాష్ట్ర హెూమ్ శాఖ మంత్రి, రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రులు కూడా మహిళలేనని అన్నారు. మహిళలు పారిశ్రామిక వేత్తలుగా, ఆర్థికవేత్తలుగా, విద్యావేత్తలుగా ఎదుగుతున్నారని ఇది శుభదాయకమని ఆమె ఆశాభావం వ్యక్తం చేసారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా మహిళలకు పెద్దపీట వస్తుందని, ఎన్నడూలేని విధంగా ఈసారి బడ్జెట్లో రూ.4,332 కోట్లు కేటాయించడం హర్షదాయకమని అన్నారు. ప్రతి మహిళా ఒక లక్షాధికారి కావాలని ఆమె ఆకాంక్షించారు.జిల్లా కలక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ జిల్లాకు ఒక ప్రత్యేకత ఉందని అన్నారు. దేశానికి మహిళలు రోల్ మోడల్ రాష్ట్ర మహిళలని అన్నారు.మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, మహిళ శక్తి స్వరూపిణీ అని, ఆ పార్వతీదేవీ పేరుతో పార్వతీపురం జిల్లాకు నామకరణం కావడం గర్వకారణమన్నారు. శాసన సభ్యులు బోనెల విజయచంద్ర మాట్లాడుతూ ఈ ప్రభుత్వం మహిళా పక్షపాతి అని అన్నారు.ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి అశుతోష్ శ్రీవాస్తవ,జిల్లా రెవెన్యూ అధికారి హేమలత, మాట్లాడుతూ మహిళల అభివృద్ధి కోసం గిరిజనాభివృద్ధి సంస్థ అహర్నిషలు కృషి చేస్తుందని అన్నారు.జిల్లా మహిళా, శిశు సంక్షేమ మరియు సాధికారత అధికారి డా. టి.కనకదుర్గ మాట్లాడుతూ చాలా మంది మహిళల త్యాగఫలము అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలకు కారణమని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, వెలుగు పథక సంచాలకులు సుధారాణి, వై.సత్యంనాయుడు, జిల్లా విద్యాశాఖాధికారి డా. యన్.తిరుపతి నాయుడు, పరిశ్రమల కేంద్రం జిల్లా మేనేజర్ యం.వి.కరుణాకర్, బీసీ సంక్షేమ శాఖ అధికారి యస్.కృష్ణ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. యస్. భాస్కరరావు, జిల్లా ప్రోగ్రామ్ అధికారి డా. టి. జగన్మోహనరావు, జట్టు ఆశ్రమం నిర్వాహకురాలు వెలిగొండ పద్మజ, చేనేత జౌళి శాఖ సహాయ అభివృద్ధి అధికారి ఎస్.వెంకట రమణ, సీడీపీఓలు, సూపర్ వైజర్లు, అంగన్వాడీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆదివాసి విలేకరుల పరిరక్షణ సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో మహిళకు చీరలు పంపిణీ

అల్లూరి జిల్లా డీపీహెచ్ఎన్ఓ భూలోకమ్మకి సన్మానించిన విలేకరులు

విశాలాంధ్ర - పాడేరు : ప్రపంచ స్థానిక ప్రజల హక్కులను కాపాడటానికి, వారి అవగాహన పెంచడానికి ప్రతి సంవత్సరం ఆగస్టు 8న అంతర్జాతీయ ప్రపంచ స్థానిక ప్రజల దినోత్సవాన్ని జరుపుకుంటారని అల్లూరి సీతా రామరాజు జిల్లా పబ్లిక్ హెల్త్ నర్సింగ్ అధికారి (డీపీహెచ్ఎన్ఓ) భూలోకమ్మ అన్నారు. ఆదివాసి విలేకరుల పరిరక్షణ సంక్షేమ సేవా సంఘం అధ్యక్ష వి.మహేష్, కార్యదర్శి కె.కృష్ణారావుల ఆధ్వర్యంలో ఆ కార్యాలయంలో ఘనంగా ప్రపంచ ఆదివాసి దినోత్సవం కార్యక్రమాన్ని మహిళలతో సంఘ సభ్యులు జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి అల్లూరి జిల్లా పబ్లిక్ హెల్త్ నర్సింగ్ అధికారి (డీపీహెచ్ఎన్ఓ) భూలోకమ్మ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆమెకు సంఘ సభ్యులు పుష్పగుచ్ఛం అందించి సాల్వతో సత్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ వంటి ప్రపంచ సమస్యలను మెరుగుపరచడానికి స్థానిక ప్రజలు సాధించిన విజయాలు, సహకారాన్ని కూడా ఈ కార్యక్రమం గుర్తిస్తుందన్నారు. దీనిని మొదటిసారిగా 1994 డిసెంబర్‌లో ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ ప్రకటించిందన్నారు. 1982లో మానవ హక్కుల ప్రచార, రక్షణపై ఉప-కమిషన్ యొక్క స్థానిక జనాభాపై యు ఎన్ వర్కింగ్ గ్రూప్ యొక్క మొదటి సమావేశం జరిగిన రోజును గుర్తు చేస్తుందన్నారు. అంతర్జాతీయ ఆదివాసి దినోత్సవం ఆదివాసి విలేకరుల పరిరక్షణ సంక్షేమ సేవా సంఘం సన్మానించడం నాకు ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. అనంతరం మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నిన్న నాయక్, కోటి బాబు, రాంబాబు, కేశవ పాడల్, లక్ష్మేశ్వరరావు బన్నీ, కృష్ణబాబు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

తెలుగుదేశం పార్టీ మహిళా విభాగం ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర - ఎటపాక : ఎటపాక మండలం నెల్లిపాక గ్రామంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు తెలుగుదేశం పార్టీ మహిళా నాయకురాలు పునుగుపాటి స్రవంతి ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళ సాధికారతకు తెలుగుదేశం పార్టీ ఎప్పుడు కట్టుబడి ఉంటుందని మహిళలకు డ్వాక్రా సంఘాలు ఏర్పాటు చేసి పావల వడ్డీకి రుణాలు పంపిణీ చేసిందన్నారు. దీపం పథకం ప్రారంభించిన ఘనత తెలుగుదేశం పార్టీ అని అన్నారు. ఈ కార్యక్రమంలో గోమ్ము కొత్తగూడెం ఎంపీటీసీ పాయం దేవి, చోడవరం యం.పి.టి.సి పెనుబల్లి.కృష్ణ కుమారి, సర్పంచ్ కోర్స. భద్రమ్మ, మాజీ ఎంపీపీ బండ రమాదేవి, బీసీ సెల్ మహిళ ఉపాధ్యక్షురాలు రూప లక్ష్మి, మాజీ యంపిటిసి ఉకే .అనురాధ, తదితరులు పాల్గొన్నారు.

ఓర్పు, నేర్పు, సహనం మహిళలకు కవచాలు
జెడ్పీటీసీ సభ్యుడు బాలయ్య ఎంపీడీవో శ్రీనివాసరావు

విశాలాంధ్ర - చింతపల్లి : ఓర్పు, నేర్పు, సహనం మహిళలకు కవచాలని జడ్పిటిసి సభ్యుడు పోతురాజు బాలయ్య, ఎంపీడీవో శ్రీనివాసరావు లు అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో స్థానిక ఎంపీపీ కోరాబు అనూష దేవి, స్థానిక సర్పంచ్ దురియా పుష్పలత, ఐసిడిఎస్ సూపర్వైజర్ విజయ కుమారి, మహిళా సమాఖ్య సభ్యురాలు బేతా నూకరత్నం. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ కే లక్ష్మి లను దుస్సాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు ఓర్పు, నేర్పు, సహనాన్ని కవచాలుగా కలిగి ఉన్నారన్నారు. గతంలో కేవలం గృహిణిగా ఉండే మహిళలు నేడు అన్ని రంగాలలోనూ రాణిస్తున్నారన్నారు. స్థానిక సిహెచ్ఒబ్బ్యా, ఆశా కార్యకర్తల నుంచి అత్యున్నత స్థాయి కలిగిన రాష్ట్రపతి వరకు నేడు మహిళలే ఉన్న విషయాన్ని ఈ సందర్భంగా వారు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో వారితోపాటు స్థానిక మండల ఉపాధ్యక్షురాలు గోపీనాయక శారద ఎంపీటీసీ సభ్యురాలు దాసరి ధారా లక్ష్మి, కొమ్మంగి ఎంపీటీసీ సభ్యురాలు జర్తా రూతు, మండల కో ఆప్షన్ సభ్యుడు నాజర్ వల్లి, రెవిన్యూ ఇన్స్పెక్టర్ మొట్టడం కృష్ణమూర్తి, వెలుగు ఏపీఎం శ్రీనివాసరావు, మాజీ వైస్ ఎంపీపీ బూసరి కృష్ణారావు, పంచాయతీ వార్డు సభ్యురాలు ఎర్రంశెట్టి వెంకటేశ్వరమ్మ (బుజ్జి) ఐసిడిఎస్ సూపర్వైజర్లు సత్యవతి, అప్పలనరస, గౌరీ, వెలుగు సిసి బంగారమ్మ, మండల మహిళా సమాఖ్య సభ్యురాలు హేమలత.

లక్ష్యాలను ఎంచుకొని విద్యనభ్యసిస్తే మహిళలు రాణించని రంగం అంటూ ఏదీ ఉండదు
సీఆర్పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ వినీత

విశాలాంధ్ర - చింతపల్లి : విద్యార్థులు లక్ష్యాలను ఎంచుకొని విద్యను అభ్యసిస్తే రాణించలేని రంగం అంటూ ఏదీ ఉండదని సిఆర్పిఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ డి. వినీత అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆ కళాశాల ప్రధానాచార్యురాలు డాక్టర్ ఎం విజయభారతి ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆమె విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. విద్య అనేది లింగ బేధం చూడదని, లక్ష్యాన్ని ఎంచుకొని విద్యనభ్యసిస్తే మహిళలు కూడా ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చు అన్నారు. మధ్యప్రదేశ్ వాసినైన తాను రక్షణ శాఖలో రాష్ట్రం కాని రాష్ట్రంలో ధైర్య సాహసాలతో విధులు నిర్వహిస్తున్నానని అన్నారు. ఇదే స్ఫూర్తిని తీసుకొని కళాశాలలోని విద్యార్థిని లందరూ ఈ దశలోనే తాము ఎంచుకున్న లక్ష్యాన్ని చేరుకునేందుకు కృషిచేయాలన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రధానాచార్యుల ఆధ్వర్యంలో అధ్యాపకులు విద్యార్థిని, విద్యార్థులు ఆమెకు పుష్పగుచ్ఛం అందించి దుస్సాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, సిఆర్పిఎఫ్ పోలీసులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఐద్వా ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం

విశాలాంధ్ర - చింతూరు : ఐద్వా, సిఐటీయు ఆధ్వ ర్యంలో జడ్పీహెచ్ఎస్ చింతూరు పాఠశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం చాలా ఘనంగా మహిళా ఉపాధ్యాయులు జరిపారు. ఈ కార్యక్రమంలో మహిళా సాధికారత గురించి పలువురు ప్రసంగించారు. మహిళలపై దాడులు అరికట్టాలని మహిళా చట్టాలను పరిష్కలంగా అమరపరచాలని వివక్షత లేని సమాజాన్ని నిర్మించాలని సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని లైంగిక దాడులు అరికట్టాలని మహిళకు గౌరవం ఇవ్వాలని మహిళలు స్వేచ్ఛగా జీవించేటువంటి సమాజాన్ని నిర్మించాలని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో చిరంజీవి బాబు, సీడీపీఓ, ఐద్వ నాయకులు సిఐటీయు మహిళ నాయకులు మహిళా ఉపాధ్యాయులు ఆశా శానిటైజర్ వర్కర్లు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే మహిళ అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుంది
తెదేపా ఇంఛార్జి మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి

విశాలాంధ్ర - పాడేరు న్యూస్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఏ ఎస్ దినేష్ కుమార్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం వి ఆర్ ఫంక్షన్ హాల్ పాడేరులో నిర్వర్తించడం జరిగింది. ఈ దినోత్సవానికి పాడేరు నియోజకవర్గ టీడీపీ ఇన్చార్జి మాజీ శాసనసభ్యులు గిడ్డి ఈశ్వరి ముఖ్య అతిథిగా హాజరై మహిళలను ఉద్దేశించి మాట్లాడుతూ .దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మహిళలకు చట్టసభల్లో 33శాంతం రిజర్వేషన్ కల్పించడం జరిగిందన్నారు.రాజకీయపరంగా ఉద్యోగ పరంగా అన్ని రంగాల్లో కూడా పురుషులతో సమానంగా మహిళా హక్కు కల్పించారు. ఆనాడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి ఉన్న సమయంలో సెల్ఫ్ హెల్ప్ గ్రూపుని (డ్వాక్రా సంఘాలు) పెట్టి పొదుపు నేర్పించి వాళ్ల కాళ్ళ మీద వాళ్ల నిలబడేటట్లు డ్వాక్రా సంఘాలు సెల్ఫ్ హెల్ప్ గ్రూప్స్ పెట్టడం జరిగింది ఇప్పుడు వాళ్ల కూడా వ్యాపారంలో పారిశ్రామికం గా ముందుకు సాగుతున్నారు. ఈ కార్యక్రమానికి అల్లూరి సీతారామరాజు జిల్లా జాయింట్ కలెక్టర్, అభిషేక్ గౌడ్ అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్, అధికారులు డ్వాక్రా మహిళలు అంగన్వాడి కార్యకర్తలు ఆశా వర్కర్‌లు మహిళా ఉపాధ్యాయులు మహిళా సంఘాలు విద్యార్థినిలు అధిక సంఖ్యలో హాజరై మహిళా దినోత్సవం విజయవంతంగా జరిపించడం జరిగింది.

అంతర్జాతీయ స్థాయిలో మహిళలు గౌరవించబడడం గర్వకారణం
ఎంపీపీ అనూష దేవి

విశాలాంధ్ర - చింతపల్లి : మహిళలు గౌరవించ బడిన చోట దేవతలు కొలువుంటారు అన్న సూక్తి అక్షర సత్యమని స్థానిక ఎంపీపీ కోరాబు అనూష దేవి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని తన కార్యాలయంలో తోటి మహిళ ప్రజా ప్రతినిధులు, మహిళా ఉద్యోగులతో కలసి కేక్ కట్ చేసి అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. రాజకీయ రంగమే గాక వివిధ ఉద్యోగ రంగాలలోనూ మహిళలు తమ ప్రతిభను కనబరుస్తూ ముందుకు సాగుతున్నారన్నారు. కేవలం మహిళలను గౌరవించుకోవాలన్న ఏకైక లక్ష్యంతో అంతర్జాతీయ స్థాయిలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించుకుంటూ ఉండడం మహిళలుగా తమ అందరికీ గర్వకారణమని ఆమె అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ దురియాపుష్పలత, వైస్ ఎంపీపీ గోపీనాయక శారద, ఎంపీటీసీ జర్త రూతు, ఐసిడిఎస్ సూపర్వైజర్లు విజయ కుమారి, సత్యవతి, గౌరీ, అప్పల నరస, వెలుగు సిసి బంగారమ్మ, మండలమహిళా సమాఖ్య సభ్యురాలు హేమలత తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేచే సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం ప్రారంభం

విశాలాంధ్ర - రంపచోదవరం : ఏజెన్సీలోని గిరిజనుల కోసం వివిధ రకాలైన రిజిస్ట్రేషన్లు నిర్వహించుటకు నూతనముగా సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం ఏర్పాటు చేయడం జరిగిందని రంపచోదవరం శాసన సభ్యురాలు శ్రీమతి మిరియాల శిరీష దేవి పేర్కొన్నారు. శనివారం స్థానిక ప్రాజెక్ట్ మోనిటరింగ్ రిసోర్స్ సెంటర్(పియంఆర్సి) లో నూతన సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం ప్రారంభోత్సవానికి రంపచోదవరం శాసనసభ్యురాలు శ్రీమతి మిరియాల శిరీష దేవి, రంపచోదవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం, రంపచోదవరం సబ్ కలెక్టర్ కెఆర్. కల్పశ్రీ ముఖ్య అతిథులుగా హాజరై రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రంపచోదవరం శాసనసభ్యురాలు శ్రీమతి మిరియాల శిరీష దేవి మాట్లాడుతూ ఈ ప్రాంత గిరిజనులకు ప్రభుత్వ చట్టాలు అనుసరించి వివిధ రకాలైన రిజిస్ట్రేషన్లు ఈ కార్యాలయంలో చేయాలని ఆమె అన్నారు. గిరిజనుల ప్రాంతం లోని గిరిజనులకు సంబంధించిన రిజిస్ట్రేషన్లు మాత్రమే ఈ కార్యాలయంలో నిర్వహించడం జరుగుతుందని ఆమె తెలిపారు. ఈ ప్రాంత గిరిజనులకు పారదర్శకతతో గిరిజనులకు మరింత షేర్వాయే విధంగా గిరిజనులకు మంచి సేవలు అందించాలని ఆమె అన్నారు. రంపచోదవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కథ సింహాచలం మాట్లాడుతూ గిరిజన చట్టాలు ప్రభుత్వ నిబంధన ప్రకారం గిరిజనుల అర్హతలను బట్టి వివిధ రకాలైన రిజిస్ట్రేషన్ చేయాలని ఆయన అన్నారు. ఈ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో గిరిజనులకు పారదర్శకతతో గిరిజనులకు మంచి సేవలు అందించాలని ఆయన అన్నారు. ఏమైనా సమస్యలు ఉన్నాయెడల మా దృష్టికి తీసుకు రావాలని ఆయన అన్నారు. రంపచోదవరం సబ్ కలెక్టర్ కెఆర్. కల్ప శ్రీ మాట్లాడుతూ ఈ ప్రాంత గిరిజనులకు ప్రభుత్వ చట్టాలను అనుసరించి వారి అర్హతను బట్టి రిజిస్ట్రేషన్లు చేయాలని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ రిజిస్ట్రర్లు డి. ఉపేంద్ర, బివివిఎస్బి శ్రీనివాస్, సీనియర్ అసిస్టెంట్ ఇ.శివ గణేష్, నాయకులు అడబాల బాపిరాజు, నలాది బాబురాజు, వి.అనంత మోహన్, మాజీ సర్పంచ్ వై.నిరంజని దేవి తదితరులు పాల్గొన్నారు.

జనసేన ఆవిర్భావ దినోత్సవానికి తరలి రావాలి

విశాలాంధ్ర - గంగవరం : ఈనెల 14వ తేదీన పిఠాపురం పట్టణంలో జరిగే జనసేన పార్టీ12వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు మండలం నుండి అధిక సంఖ్యలో పార్టీ అభిమానులు, కార్యకర్తలు హాజరుకావాలని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొలిశెట్టి సత్యనారాయణ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా గంగవరంలో జనసేన పార్టీ మండల అధ్యక్షులు కుంజం సిద్దు అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పోస్టర్ను విడుదల చేశారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు ఆది నారాయణ, జనసేన సమన్వయ కర్త రాజశేఖర్ రెడ్డి, ఈ కార్య క్రమంలో మండల ఉపాధ్యక్షులు గవ రాజు, విష్ణు, కంగల శివ, గణేష్ రెడ్డి, రవి, ప్రసాద్, గణేష్, శ్రీను, ఆనంద్, రమణ వీర మహిళలు సీత, వరలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల ఆర్థికాభివృద్ధికి ఉద్యానవన శ్రేష్టం : ఎమ్మెల్యే శిరీషా దేవి

విశాలాంధ్ర - రంపచోడవరం : ఏజెన్సీలోని ఉద్యానవన పంటల గిరిజన రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని రంపచోడవరం శాసన సభ్యురాలు శ్రీమతి మిరియాల శిరీష దేవి పేర్కొన్నారు. శనివారం స్థానిక హెచ్ యన్‌టిసీ ఫారం లో ఉద్యానవన పంటల రైతులకు సబ్సిడీపై పవర్ స్ప్రేర్లు పంపిణీ కార్యక్రమానికి రంపచోడవరం శాసన సభ్యురాలు శ్రీమతి మిరియాల శిరీష దేవి, రంపచోడవరం ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం, రంపచోడవరం సబ్ కలెక్టర్ కెఆర్. కల్పశ్రీ ముఖ్య అతిథులుగా హాజరైనారు. ఈ సందర్భంగా రంపచోడవరం శాసన సభ్యురాలు శ్రీమతి మిరియాల శిరీష దేవి మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజన రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా వ్యవసాయానికి సంబంధించిన పవర్ స్ప్రేర్లు, వ్యవసాయ పనిముట్లు సబ్సిడీపై గిరిజనులకు అందజేయడం జరుగుతుందని ఆమె తెలిపారు. ప్రపంచ మహిళా దినోత్సవానికి పురస్కరించుకొని ఏడు మండలాల్లోని మహిళా ఉద్యానవన పంటల రైతులకు 300 మందికి పవర్ స్ప్రేర్లు 90 శాతం సబ్సిడీపై ఒక్కొక్క పవర్ స్ప్రేర్ 17,340 ఖరీదు చేసే పవర్ స్ప్రేర్ 1734 రూపాయలకే రెండున్నర ఎకరాలు భూములు ఉన్న ఉద్యానవన పంటల రైతులకు పవర్ స్ప్రేర్ అందజేయడం జరిగిందని ఆమె తెలిపారు. మొత్తం 300 పవర్ పేర్లు 51లక్షల రూపాయల వ్యయంతో 48 లక్షల రూపాయల సబ్సిడీతో ఉద్యానవన మిషన్ నిధులతో రైతులు మంచి పంటలు పండించి ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా ఈరోజు పవర్ స్ప్రేర్లు పంపిణీ చేయడం జరిగిందని ఆమె తెలిపారు. రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం మాట్లాడుతూ ఏజెన్సీ ఏడు మండలాల్లోని ఉద్యానవన పంటల రైతులు మంచి పంటలు పండించి మీ కుటుంబాలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆయన అన్నారు. ప్రస్తుతం పవర్ స్ప్రేర్ తీసుకున్న రైతులు మీ దగ్గరలో ఉన్న రైతులకు పవర్ స్ప్రేర్లు కావలసి ఉన్నయెడల మానవత్వంతో మీ గ్రామంలో రైతులకు సహాయం చేయాలని ఆయన అన్నారు. రంపచోడవరం సబ్ కలెక్టర్ కెఆర్. కల్పశ్రీ మాట్లాడుతూ ఏజెన్సీలోని గిరిజన రైతులు వ్యవసాయంపై ప్రత్యేక దృష్టి పెట్టిన ఎడల మంచి మంచి పంటలు పండించవచ్చని ఆమె అన్నారు. ఏజెన్సీలోని గిరిజనులు పండించిన ఉద్యానవన పంటలకు మైదాన ప్రాంతంలో మంచి గుర్తింపు ఉంటుందని ఆమె అన్నారు. సబ్సిడీపై పవర్ స్ప్రేర్లు పొందిన రైతులు చక్కగా ఉపయోగించుకొని మంచి పంటలు పండించి మంచి అభివృద్ధి చెందాలని ఆమె తెలిపారు. అనంతరం రైతులకు పవర్ స్ప్రేర్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు అనంత మోహన్, కారం సురేష్, అడబాల బాపిరాజు, మాజీ సర్పంచ్ వై నిరంజనీ దేవి,సలాది బాపిరాజు, పిహెచ్‌ట. కే.చిట్టిబాబు, సబస్టెంట్లు భీమన్న, నూకరాజు, నాగరాజు, శోభన్ బాబు, స్వర్ణలత , ఏడు మండలాలకు సంబంధించిన రైతులు తదితరులు పాల్గొన్నారు.

బాధితుడు కరుణాకర్‌కి ఆర్థిక సహాయం

విశాలాంధ్ర - వి.ఆర్.పురం : ఇటీవల బైక్ ప్రమాదంలో గాయాలు పాలయి ఖమ్మం మమత హాస్పిటల్‌లో చికిత్స పొందు తూన్న కరుణ కర్ పరిస్థితి తెలుసుకొని ఖమ్మం హాస్పిటల్ కి వచ్చి అబ్బాయి ని చూసి, మానవతా దృక్పథంతో వైద్య ఖర్చుల నిమిత్తం 5000 రూపాయలు జి. చంటి (ఎస్సై) బాధితునికి సహాయంగా అందించారు. ఆయన గతంలో విఆర్ పురం ఎస్సైగా (చంటి) విధులు నిర్వహించారు. ఆయన చేసిన సహాయానికి పలువురు కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

విశాలాంధ్ర - హుకుంపేట : అంత ర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని ఆంధ్రప్రదేశ్ గిరిజన విలేకరుల సేవ సంఘం ఆధ్వర్యంలో స్థానిక జ్ఞాన సాగర్ ఒకేషనల్ జూనియర్ కళాశాల మహిళా దినోత్సవ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఒకే షనల్ జూనియర్ కళాశాల ఫౌండర్ బ్రహ్మ కుమారి అమ్మను దుస్సాలు వతో సత్కరించి మహిళా దినోత్స వ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ మహిళలకు రక్షణ బాధ్యత వారి తల్లిదండ్రులు తీసుకోవాలని అన్నారు. అమ్మను మించిన దైవం లేదని అమ్మను దైవంగా భావిస్తూ స్ఫూర్తిదాయకంగా ముందుకు సాగాలన్నారు. సమాజంలో మహి ళలపై అణిచివేతకు గురవుతున్నా రు. మహిళలను గౌరవించిన నాడే నిజమైన మహిళ దినోత్సవం అని వారికి ఇచ్చిన వారము అవుతాము ని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏ.పీ.టీ.ఆర్.ఏ డివిజన్ విలేకరులు సిహెచ్ రమణ, పి సూర్యా రావు, ఎం రాజు, టి సునీల్,ఆనంద్, పండు,శ్రీను నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మగవారితో పాటు మహిళలు అన్ని రంగాల్లో పోటీ పడాలి

విశాలాంధ్ర - గంగవరం : మగ వారితో పాటు మహిళలు అన్ని రంగాల్లో పోటీ పడాలని మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు కొంచెం గంగాదేవి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో యుటిఎఫ్ మండల మహిళా అధ్యక్షురాలు రుక్మిణి దేవి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళా సాధికారత సాధన కు ప్రభుత్వాలు కృషి చేయాలన్నారు. ఈ సంద ర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ భావన మాట్లాడుతూ మాట్లాడుతూ మహిళలు బాలికలు అన్ని రంగాల్లో దూసుకు పోవాలంటే నిరక్షరాస్యతను వదిలి అక్షరాస్యులు కావాలన్నారు. ప్రతి మహిళా తమ బాలికలను ఉన్నత చదువులు అభ్యసించేలా ప్రోత్సహించాలని బాల్య వివాహాలకు దూరంగా ఉండాలన్నారు. గ్రామాల్లో ఆరోగ్యం ఆహార విషయంలో మహిళలు ప్రధాన పాత్ర పోషించాలన్నారు. మరో అతిథి వైద్యులు డాక్టర్ పవన్ కుమార్ మాట్లాడుతూ మహిళా శక్తి గొప్పదనాన్ని వివరించారు. మహిళా దినోత్సవ కార్యక్రమంలో పాల్గొనడం చాలా ఆనందంగా ఉందని ఆయన అన్నారు. యుటిఎఫ్ రాష్ట్ర మహిళ కౌన్సిలర్ , మండల మహిళా అధ్యక్షురాలు రుక్మిణి దేవి మాట్లాడుతూ యుటిఎఫ్ మహిళా ఉపాధ్యాయుల పక్షాన అనేక మహిళా సమస్యలు పరిష్కారం కోసం పోరాడడం జరుగుతుందన్నారు. మహిళా సాధికారత బాలిక విద్యాభివృద్ధికి మహిళా ఉపాధ్యాయులు మరింత పాటు పడాలని ఆమె పిలుపునిచ్చారు. సీనియర్ ఉపాధ్యాయులు పి ఉమాదేవి, రాధా కుమారి, తదితరులు ప్రసం గించారు. తొలిత మహిళలకు యుటిఎఫ్ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు నిర్వహించారు. క్రీడల్లో విజేతలకు వారు బహుమతులు అందించి అభినందించారు. మహిళా ఉపాధ్యాయులు, యూటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

వాడపల్లి గిరిజన విద్యార్థిని మృతిపై సమగ్ర విచారణ

విశాలాంధ్ర - రంపచోడవరం : రంపచోడవరం మండలం వాడపల్లి గిరిజన సంక్షేమ శాఖ బాలికల ఆశ్రమ పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న విద్యార్థి దొరి అశ్విని మరణం పై పూర్తిస్థాయిలో విచారణ జరిపించడం జరుగుతుందని రంపచోడవరం శాసన సభ్యురాలు శ్రీమతి మిరియాల శిరీష దేవి, రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం పేర్కొన్నారు. శనివారం వాడపల్లి గ్రామంలోని గిరిజన సంక్షేమ శాఖ బాలికల ఆశ్రమ పాఠశాలలో ఆరో తరగతి విద్యార్థి దొరి. అశ్విని మరణ వార్త తెలిసిన వెంటనే రంప చోడవరం ఎంపీడీవో యస్. శ్రీనివాస్ దొరను, సహాయక గిరిజన సంక్షేమ శాఖ అధికారి రామ తులసి నీ పంపించడం జరిగిందని. వెంటనే అధికారులు అక్కడి చేరుకొని వాడపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా ఈ బాలిక చనిపోయిందని వైద్యాధికారి ధ్రువీకరించడం జరిగిందని అధికారులు తెలుపగా వెంటనే హుటాహుటిన రంపచోడవరం శాసన సభ్యురాలు శ్రీమతి మిరియాల శిరీష దేవి, రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం ఆశ్రమ పాఠశాలను పరిశీలించి ఏ విధంగా చనిపోయినది ఆరా తీశారు. ఈ విద్యార్థి ఉదయం టిఫిన్ చేసిన వెంటనే హాస్టల్ గదిలోకి వెళ్లి చున్నితో ఫ్యానుకు ఉరి వేసుకోవడం జరిగిందని ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మి, వార్డెన్ మంగయమ్మ తెలియజేయడం జరిగింది ఈ సంఘటనకు నిర్లక్ష్యంగా ఉన్నందుకు ప్రధానోపాధ్యాయురాలకు సోకజ్ నోటీసు, వార్డెన్ కు ముందుగా సస్పెండ్ చేయడం జరుగుతుందని ప్రాజెక్ట్ అధికారి తెలిపారు. ఈ ఆశ్రమ పాఠశాలలో ఆరవ తరగతి చదువుతున్న దొరి అశ్విని మరణం పట్ల పూర్తిస్థాయి విచారణ అధికారులుగా గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ యం.రుక్మ%శీ%దయ్య, సహాయక గిరిజన సంక్షేమ శాఖ అధికారి రామ తులసిని నియమించడం జరిగిందని ప్రాజెక్ట్ అధికారి తెలిపారు. అదేవిధంగా చనిపోయిన విద్యార్థిని పూర్తిస్థాయిలో పంచనామ చేసి పోస్టుమార్టం కొరకు రంపచోడవరం ఏరియా ఆసుపత్రికి తరలించాలని రంపచోడవరం సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆర్ జె. రవికుమార్ను ప్రాజెక్ట్ అధికారి ఆదేశించారు.

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

విశాలాంధ్ర - వి.ఆర్.పురం : అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని రేఖపల్లి ఎంపీడీవో మీటింగ్ హాల్ ప్రాంగణంలో యుటిఎఫ్ , మహిళా సంఘం, సిఐటీయు ఆధ్వ ర్యంలో అంతరా తీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. మహిళా సాధికారిత పై జరిగినటువంటి సదస్సులో మండల యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం మహిళ సహాధ్యక్షురాలు ముల్లి విజయ మాట్లాడుతూ మహిళల పట్ల సమాజంలో నేటికీ చిన్నచూపు ఉన్నదని ఎన్ని చట్టాలు వచ్చిన వరకట్న వేధింపులు, హత్యాచారఘటనలు తగ్గడం లేదని ఇది బాధాకరమని ,మహిళలకు చట్టసభలో రిజర్వేషన్ల శాతం పెంచాలని,అన్నారు. మండల ఎంపీపీ. మహిళా సంఘం అధ్యక్షురాలు కారం లక్ష్మీ మాట్లాడుతూ ఓ మహిళ అంతరిక్షానికి వెళ్లి చందమామను పరీక్షించి వచ్చే స్థాయికి వచ్చినా... సమాజంలో మహిళల పట్ల వివక్షత కొనసాగుతూనే ఉందని, మహి ళలే మహారాణులు అనే రోజు రావాలని ఆమె అన్నారు. ఈ సందర్భంగా వేదిక మీద ఏర్పాటు చేసినటువంటి కేకును మహిళలందరి సమక్షంలో కట్ చేసి, స్థానిక సాంప్రదాయ ఆటా. పాటా నృత్యాలు చేసి, మహిళలందరూ కలిపి వీల్ చైర్ తదితర ఆటలను ఆడడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఐద్వామండల కార్యదర్శి ముసురు రాజేశ్వరి, సున్నం రంగమ్మ, యుటి ఎఫ్ నాయకులు ఎస్ నాగేశ్వరరావు, ఎన్ జగదీష్, బాబు, వెంకట్, రాజు, ఆశా వర్కర్స్ నుండి లలిత, శైలజ, సూర్యాంభ, భవాని, ఎండిఎం వర్కర్స్ నుండి చోడె వరలక్ష్మి పాల్గొన్నారు.

సత్యకైలాస్ పాఠశాలలో ఘనంగా జరిగిన మహిళా దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర - జియ్యమ్మవలస : మండలంలోని పెదమేరంగి కూడలిలో గల సత్య కైలాస్ పబ్లిక్ స్కూల్లో శనివారం నాడు అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంను డిఆర్‌కె గ్లోబల్ అకా డమిక్స్ వారి సౌజన్యంతో జరిగినట్లు పాఠశాల యాజమాన్యం తెలిపారు. పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులు వారి తల్లిదండ్రులను ఈకార్యక్రమానికి ఆహ్వానించి సమాజంలో మహిళల పాత్ర అనే అంశంపై చర్చించారు. అనంతరం తమ పిల్లలను ఏవిధముగా ఏఏరంగాలలో ప్రోత్సహించాలన్న దానిపై పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాలితేరు రాజశేఖరరావు వివరించారు. అనంతరం కన్నపుదొరవలస పంచాయితీ సర్పంచ్ అన్నపూర్ణ పాఠశాల విద్యార్థులు తల్లులతో వాన ఉష అల్లుపూర్ణిమ వివిధ రంగాలలో విశేష ప్రతిభ కనబరిచిన పాఠశాల పూర్వ ఉపాధ్యాయురాలు బి శ్రీదేవిలను ఘనంగా సన్మానించి వారికి జ్ఞాపికలను అందజేశారు. ఈకార్యక్రమాలలో పాఠశాల డైరెక్టర్ డి.అరుణ్ కుమార్, ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థినీవిద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర - బెలగాం/గరుగుబిల్లి : గరుగుబిల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు పురుషులతో సమా నంగా అన్ని రంగాల్లో వారు ప్రతిభను కనబరుస్తు న్నార న్నారు. ప్రతి పురుషుని వెనక కచ్చితంగా ఒక మహిళ ఉంటుందని వారిని ఎప్పుడూ ఉన్నత స్థానంలో ఉంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు, బిడ్డిక చిన్నమ్మి, రవణమ్మ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నాటు సారా తయారీ క్రయవిక్రయాలు చేసిన వారిపై కఠిన చర్యలు

విశాలాంధ్ర - చింతపల్లి : మన్యంలో నాటు సారా తయారుచేసినా, క్రయ విక్రయాలు కఠిన చర్యలు తీసుకుంటామని చింతపల్లి ప్రొహి బిషన్ అండ్ ఎక్సైజ్ సర్కిల్ ఇన్స్పెక్టర్ జె కూర్మారావు అన్నారు. నవోదయమ్ - 2.0 కార్యక్రమంలో భాగంగా శనివారం చింతపల్లి, వీధి మండలాల్లోని లమ్మసింగి, ఆసరాడ గ్రామాల లో గ్రామ సభలు ఏర్పాటు చేసి, గ్రామస్తులకు కళా జాత ద్వారా నాటుసారాకు వ్యతిరేకంగా అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో నాటుసారా తయారు చేసినా, కయ విక్రయాలకు పాల్పడిన ఆంధ్రప్రదేశ్ ప్రోహిబిషన్ చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నాటుసారా సంబ%శీ%దిత ఫిర్యాదుల కొరకు 14405 టోల్ ఫ్రీ నెంబర్ కి సమాచారం అందించాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్ ను నాటుసారా రహిత రాష్ట్రంగా తయారు చేసేందుకు ప్రారంభించిన నవోదయం - 2.0 కార్యక్రమానికి అందరూ సహక రించాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆ శాఖ సిబ్బంది, మహిళా పోలీస్, గ్రామ పెద్దలు, కళాజాత బృందం సభ్యులు పాల్గొన్నారు.

మంచి పనికి మించిన పూజ లేదు మానవత్వానికి మించిన సంపద లేదు

సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎం.వినోద్‌బాబు

విశాలాంధ్ర - చింతపల్లి : మంచి పనికి మించిన పూజ లేదు, మానవత్వానికి మించిన సంపద లేదు. మనిషికి మరణం ఉంటుంది గానీ మంచితనానికి ఉండదంటూ స్థానిక సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎం వినోద్ బాబు అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆ కళాశాల ప్రధానాచార్యురాలు డాక్టర్ ఎం విజయ భారతి ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకులు విద్యార్థులు, ఎస్సై వెంకటరమణ ఇతర పోలీసులతో కలసి అంతర్జాతీయ మహిళా దినోత్సవ బ్యానర్ పట్టుకుని ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో మహిళలు ప్రతి చోటా గౌరవించబడే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మగవారితో సమానంగా మహిళలకు రిజర్వేషన్లు కల్పించడం జరిగిందన్నారు. నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రతి చోట మహిళలను, పూజించడం, సన్మానించడం, గౌరవించు కోవడం ప్రతి ఒక్కరికి గౌరవపదమని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

విజయవంతంగా జరిగిన అంతర్జాతీయ మహిళా పోరాట దినం

విశాలాంధ్ర - బెలగాం : మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈరోజు పార్వతీపురం ఎన్జీఓ భవన్ వద్ద స్త్రీ విముక్తి సంఘటన ఆధ్వర్యంలో ప్రస్తుత పరిస్థితుల్లో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు - మహిళల కర్తవ్యాలు అనే అంశంపై స్త్రీ విముక్తి సంఘటన రాష్ట్ర కమిటీ సభ్యురాలు పి.కృష్ణవేణి అధ్యక్షతన సభ నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు జరిపిన చరిత్ర పోరాటాలను గుర్తు చేసుకుని ఈనాడు పెరుగు తున్న విష సంస్కృతి మద్యం మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎపిటిఎఫ్ ఉపాధ్యాయ నాయకులు ప్రమీల రాణి మాట్లాడుతూ క్లారా జెట్కిన్ అనే కమ్యూనిస్టు నాయకురాలు 1910లో కోపెన్ హగ్ లో జరిగిన సమావేశంలో మహిళలు సాధించుకోవలసిన హక్కుల కోసం వారిలో పోరాటస్ఫూర్తిని నింపే విధంగా ఒక రోజు ఉండాలని మార్చి 8న ఆవిడ ప్రతిపాదించారు. అప్పటినుండి మార్చి 8 ని మహిళా దినోత్సవంగా ప్రపంచం అంతా జరుపుకుంటున్నారన్నారు. పురుషులతో సమానంగా వేతనాల కోసం, పని ప్రదేశాలలో భద్రత కల్పించాలని, జీతంతో కూడిన ప్రసూతి సెలవులు ఇవ్వాలని అనేక పోరాటాలు చేసి విజయాలు సాధించుకున్నారన్నారు. అలాగే పురుషులతో కలిసి ఎనిమిది గంటల పని దినం కోసం పోరాడన్నారు. ఈ రోజుల్లో చూసుకు న్నట్లయితే మహిళలపై దాడులు అఘాయిత్యాలు పెరిగిపోయాయని దీనికి కారణం మహిళలను విలాస వస్తువుగా చిత్రిస్తున్న సినిమా, టీవీ సంస్కృతిని విమర్శించారు. ఈ విష సంస్కృతిని ప్రభుత్వాలు కంట్రోల్ చేయకుండా కేవలం మహిళలపై అఘాయిత్యం జరిగిన తరువాత స్పందించే చట్టాలను మాత్రమే తీసుకువస్తున్నారని అన్నారు. అలాగే మహిళల చేత నైట్ షిఫ్టులు చేయించే విధంగా చట్టాలలో మార్పులు తీసుకొచ్చారని దీని ద్వారా మరింతగా మహిళలపై అఘాయిత్యాలు పెరిగాయని కాబట్టి నైట్ షిఫ్టుల్లో మహిళల చేత పని చేయించే చట్టాలను మార్పు చేసి మహిళలకు మరింత భద్రత కల్పించాలని ఆ విధంగా ప్రభుత్వాలు చేయకపోతే మహిళలు పోరాడి సాధించుకోవాలని అన్నారు. రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి దంతులూరి వర్మ మాట్లా డుతూ ప్రభుత్వాలు మద్యాన్ని ప్రోత్సహిస్తూ మగవారందరిని మత్తుకు బానిసలుగా చేస్తున్నారని దీనివలన కుటుంబ భారం మొత్తం స్త్రీ పై పడి ఇంకా మోయలేని ఒత్తిడికి గురవుతున్నారన్నారు. ఈమధ్యం మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా మహిళా లోకం కదిలి తమ భర్తలను, బిడ్డలను మత్తుకు బానిసలు చేస్తున్న మద్యం పాలసీలను వ్యతిరే కించాలని పిలుపునిచ్చారు. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో సమాన పనికి సమాన వేతనం కోసం పోరాడాలని అన్నారు. ప్రజా కళాకారుల సమాఖ్య కళాకారులు పాటలు పాడారు. వివిధ గ్రామాల నుంచి మహిళలు 250 మంది పాల్గొని సభను విజయవంతం చేశారు. సభ అనంతరం ఎన్జీవో భవన్ నుండి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు ర్యాలీ నిర్వహించి మానవహారంగా నిలబడి మార్చి 8 సంబరాల దినం కాదు మహిళల పోరాట దినమని చాటి చెప్పారు. ఈ కార్యక్రమానికి మహిళా ఉపాధ్యాయులు లలితమ్మ, స్త్రీ విముక్తి సంఘటన నాయకులు మరియా, జయసుధ రైతు కూలీ సంఘం నాయకులు శ్రీను నాయుడు, ఎన్.వై.ఎస్ నాయకులు పి. అసిరి, పిడిఎస్‌ఓ నాయకులు కె. సోమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్ష ప్రశాంతం

530 మంది విద్యార్థులు హాజరు.. 43 మంది గైర్హాజర్

విశాలాంధ్ర - చింతపల్లి : ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్ష శనివారం ప్రశాంతంగా జరిగింది. 530 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్లు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఏపీ గురుకుల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌లు కే.గోవిందరావు, రామేశ్వరం లు తెలిపారు. ఈ నేపథ్యంలో శనివారం జరిగిన మొదటి సంవత్సరము పరీక్షకు గాను 573 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా, 530 మంది మాత్రమే పరీక్షలకు హాజరయ్యారని, 43 మంది గైర్హాజర్ అయ్యారని ఆయా కళాశాలల ప్రిన్సిపాల్ లు/చీఫ్ సూపరింటెండెంట్ లు తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 374 మంది విద్యార్థులకు గాను 340 మంది విద్యార్థులు హాజరయ్యారని, అలాగే 34 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాలేదని, అదేవిధంగా ఏ పి గురుకుల కళాశాల లో 199 మంది విద్యార్థులకు గాను 190 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారని 9 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాలేదని వారు తెలిపారు. ఈ నేపథ్యంలో ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్ష శనివారం ప్రశాంతంగా జరిగింది.

శనివారం జరిగిన పరీక్షలలో 502 మంది గైర్హాజరు

విశాలాంధ్ర - పార్వతీపురం : జిల్లాలో శనివారం జరిగిన ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం మ్యాథ్స్ 1బి, జ్యూయాలజీ, హిస్టరీ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి డి.మంజులవీణ ఒక ప్రకటనలో తెలిపారు.ఈపరీక్షలకు సంబ ంధించి జిల్లాలోసాధారణ కోర్సుల విద్యార్థులు 179మంది, వొకేషనల్ విద్యార్థులు 323 మంది గైర్హాజరయినట్లు తెలిపారు.జిల్లా ఎగ్జామినేషన్ కమిటీతోపాటు రెండు సిట్టింగ్ స్క్వాడ్ బృందాలు, రెండు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు పర్యవేక్షణ చేసాయన్నారు.461 సీసీ కెమెరాలు పర్యవేక్షణలో పరీక్షలను జిల్లా ఎగ్జామినేషన్ కంట్రోల్ రూమ్, రాష్ట్ర ఎగ్జామినేషన్ కంట్రోల్ రూమ్ లు పర్యవేక్షణ చేశాయన్నారు. ఎక్కడా మాస్ కాపీయింగ్ జరగలేదని తెలిపారు. ఇదిలా ఉండగా సీతానగరం మండలంలోని జోగంపేట ప్రతిభ కళాశాల పరీక్షా కేంద్రంలో 149 మంది విద్యార్థులు హాజరుకాగా ఒక విద్యార్థి గైర్హాజరయినట్లు సిఎస్ కృష్ణారావు, డిఓశాంతిలు తెలిపారు. సీతానగరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో120 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా ఒక విద్యార్థి గైర్హాజరయినట్లు సిఎస్ ప్రదీప్ కుమార్, డిఓ మహారాణాలు తెలిపారు.

జనరిక్ మందులపై అవగాహన కలిగి ఉండాలి

విశాలాంధ్ర - బెలగాం : జనఔషధి దినోత్సవం సందర్భంగా జిల్లా ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్. భాస్కరరావు శుక్రవారం పాల్గొన్నారు. ఈ మేరకు డిసిహెచ్ఎస్ మరియు జిల్లా ఆసుపత్రి సూప రింటెండెంట్ డాక్టర్ బి. వాగ్దేవి, వైద్యశాఖ అధికారులతో కలిసి జనరిక్ మందులపై అవగాహన కల్పించారు. జనరిక్ మందులు బ్రాండ్ నేమ్ మందుల కంటే తక్కువ ధరలో లభిస్తాయని వీటిలో ఉండే రసాయన పదార్థాలు, మోతాదు, రూపం, ఫలితాలు బ్రాండ్ నేమ్స్ డ్రగ్ మాదిరిగానే సమానంగా ఉంటాయన్నారు. చికిత్స విషయంలో జనరిక్ మందులు బ్రాండ్ నేమ్ మందులు మాదిరిగా అదే క్రియాశీలతను కలిగి ఉంటాయన్నారు. జనరిక్ ఔషదం బ్రాండ్ నేమ్ ఔషదం వలె సురక్షితమైనది మరియు ప్రతిభవంతమైనదని పేర్కొన్నారు. బ్రాండ్ నేమ్ డ్రగ్ ధరతో పోల్చితే 80 నుండి 85 శాతం తక్కువ ధరలో లభిస్తాయన్నారు. బ్రాండ్ ఔషధాలపై పేటెంట్ల గడువు ముగిసిన తర్వాత జనరిక్ ఔషదాలను విక్రయించడానికి అనుమతిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి డాక్టర్ ఎం. వినోద్ కుమార్, ఎఎంఓ సూర్యనారాయణ, కన్సల్టెంట్ రామచంద్ర, జిల్లా ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ చేతుల మీదుగా విద్యార్థులకు కళ్ల జోళ్లు పంపిణీ

విశాలాంధ్ర - బెలగాం : పాఠశాల విద్యార్థులకు ఆరోగ్య కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ఉన్నతా ధికారుల ఆదేశాల మేరకు గతంలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 56,893 మంది విద్యార్థులకు నేత్ర పరీక్షలు నిర్వహించి దృష్టి దోషం వున్న 1,841 మంది విద్యార్థులకు జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో నేత్ర వైద్య అధికారి జీరు నగేష్ రెడ్డి పర్యవేక్షణలో వారికి త్వరలో కళ్ల జోళ్లు పంపిణీ చేస్తున్నట్లు, ఈ రోజు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం పార్వతీపురంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ మరియు ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి చేతుల మీదుగా విద్యార్థులకు కళ్ళ జోళ్ళు అందచేసి జిల్లా వ్యాప్తంగా పంపిణీ చేయుటకు లాంఛనంగా ప్రారంభించారు. ఈ కళ్ల జోళ్లు కంటి చూపు కాపాడుకోవడానికి శ్రద్ధ చూపాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి మరియు జిల్లా అంధత్వ నివారణ సంస్థ ప్రోగ్రామ్ మేనేజర్ డా. ఎస్. భాస్కరరావు సూచించారు. అలాగే కలెక్టర్ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న కంటివెలుగు కార్యక్రమంలో ప్రజలకు కూడా నేత్ర పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఇందులో దృష్టి దోషం వున్న వారికి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది ద్వారా ఉచితంగా కళ్ల జోళ్లు పంపిణీ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రామ్ అధికారి డా. టి. జగన్ మోహన రావు నేత్ర వైద్య సహాయకులు రమేష్, ఆరోగ్య కార్యకర్తలు,ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

యువత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

జిల్లా పార్టీ అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షిత్ రాజు

విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్ : ఈ నెల 12న తలపెట్టిన యువత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైసీపీ పార్వతీపురం మన్యం జిల్లా పార్టీ అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షిత్ రాజ్ కోరారు. శనివారం స్థానిక మాజీ శాసనసభ్యులు అలజంగి.జోగారావు ఇంటి వద్ద నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూకూటమి ప్రభుత్వం అనేక హామీలను ఇచ్చి అధికారం చేపట్టి ఇప్పటికే సుమారుగా 10 నెలలు పూర్తి కావస్తున్నప్పటికీ కూడా రాష్ట్రంలో ఇచ్చిన మాటను నిలబెట్టుకునే పరిస్థితి లేక ఉద్యోగాల కల్పన లేకుండా, నిరుద్యోగ భృతి ఇవ్వకుండా యువతను అలానే ఫీజు రీయింబర్స్మెంట్, విద్యా దీవెన,వసతి దీవెనల బకాయిలు చెల్లించకుండా, వైద్య విద్యను ప్రైవేటీకరిస్తూ విద్యార్థులను నిలువునా మోసగించిన కూటమి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి బకాయిలు చెల్లించేలా అన్ని జిల్లా కేంద్రాల్లో ఈనెల 12వ తేదీన తలపెట్టిన “యువత పోరు” జిల్లా కార్యక్రమం విజయవంతం చేయాలన్నారు.కార్యక్రమంలో జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు బలగ శ్రీరాములు నాయుడు, మూడు మండలాల పురపాలక సంఘం పార్టీ అధ్యక్షులు,జిల్లా పార్టీ కార్యదర్శులు, నియోజకవర్గ స్థాయి వివిధ అనుబంధ విభాగాల అధ్యక్షులు, సర్పంచ్లు, ఎంపీటీసీ సభ్యులు, కౌన్సిలర్ సభ్యులు, పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం

విశాలాంధ్ర - చింతూరు : చింతూరులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం కార్యక్రమాన్ని ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్, జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలోశనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్.కె. రత్న మాణిక్యం విచ్చేసి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని మహిళ హక్కుల ఉద్యమ చరిత్రలో ఒక మలుపును సూచిస్తుందన్నారు . పునరుత్పత్తి హక్కులు, లింగ సమానత్వం, మహిళలపై హింస, దుర్వినియోగ నివారణ వంటి ముఖ్యమైన సమస్యలపై మహిళా శక్తి సంఘటితంగా పోరాటం చేస్తున్నారని తెలిపారు. వైస్ ప్రిన్సిపాల్. ఎం శేఖర్ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా మహిళా ఒక మగాడి విజయం వెనుక ఒక తల్లి చెల్లి అక్క కూతురు ఇలా ఎవరో ఒక స్త్రీ మూర్తి ఉండే సమసమాజ స్థాపనలో ప్రధాన పాత్ర వహిస్తుందని తెలిపారు. చింతూరు సబ్ ఇన్స్పెక్టర్ రమేష్ మాట్లాడుతూ శక్తివంతమైన స్త్రీమూర్తులు ప్రపంచ వ్యాప్తంగా అనేక రంగాల్లో ఉన్నత స్థానంలో ఉన్నారని తెలిపారు. మహిళ సాధికారత సమన్వయకర్త కె.శైలజ మాట్లాడుతూ అమ్మ స్థానంలో ఉండి తన జీవితాన్ని కుటుంబ సభ్యుల అభివృద్ధికి త్యాగం చేస్తుందన్నారు. కంప్యూటర్ సైన్స్ లెక్చరర్ నూనె రమేష్ మాట్లాడుతూ మహిళలు కుటుంబ వ్యవస్థలో ఒక బలమైన శక్తి తన కోసమే కాదు ఇతరుల కోసం కూడా నిలబడుతుంది, పోరాడుతుంది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు జి.వెంకటరావు, డాక్టర్. వై.పద్మ, కె.శకుంతల, జి.సాయి కుమార్, యస్.అప్పనమ్మ, యం.నాగమోహనరావు, జి.హారతి,కె శ్రీదేవి, కె.శ్రీలక్ష్మి, రాజబాబు, బి.శ్రీనివాసరావు తదితర అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కొరడగూడకు సీసీ రోడ్డు సదుపాయం కల్పించాలి

విశాలాంధ్ర - గుమ్మలక్ష్మీపురం : పార్వతీపురం మన్యం జిల్లా, గుమ్మలక్ష్మీపురం మండలం, దుమ్మంగి పంచాయితీ చెందిన కొరడగూడ గ్రామస్తులు ప్రజా దర్బార్ కార్యక్రమంలో తమ గ్రామానికి సీసీ రోడ్డు సౌకర్యం కల్పించాలని ప్రభుత్వ విప్ కురుపాం నియోజకవర్గ శాసనసభ్యురాలు తోయక జగదీశ్వరికి క్యాంప్ కార్యాలయంలో వినతిపత్రం ఇచ్చారు. గ్రామంలో సి.సి రోడ్డు లేక వర్షాకాలంలో చాలా ఇబ్బందులకు గురవుతున్నామని తెలిపారు. ఎమ్మెల్యే సాను కూలంగా స్పందించి సమస్యను పరిష్కరించే విధంగా కృషి చేస్తానన్నారు. గ్రామస్తులుతో మాట్లాడుతూ ఏమైనా సమస్యలు ఉన్నాయ అని అడిగి తెలుసుకుని, ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని ఈ సందర్భంగా తెలిపారు.

రెండవసారి అవార్డు అందుకున్న రేవళ్ళు మహిళ పోలీస్

విశాలాంధ్ర - కొయ్యూరు : అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా రేవళ్ళు సచివాలయ మహిళా పోలీస్ దుమ్మంతి ఇందిరా ప్రియాంక కు రెండవసారి అరుదైన గౌరవం దక్కింది. మహిళా దినోత్సవం సందర్భంగా పాడేరులో జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ ఎస్పి అమిత్ బర్దర్, జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ్ సమక్షంలో కొయ్యూరు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారి కే విజయ కుమారి చేతుల మీదగా మహిళ పోలీస్ ఇందిర ప్రియాంక బెస్ట్ ఎంప్లాయ్ అవార్డు అందు కున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూ మహిళ దినోత్సవం సందర్భంగా రెండవసారి ఈ అరుదైన అవార్డును అందుకోవడం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని ఆమె తెలిపారు. దీంతో మరింత బాధ్యతగా తన విధులు నిర్వహిస్తానని ఆమె తెలిపారు.

రైతులకు రావాల్సి రవాణా చార్జీలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలి

ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం విజ్ఞప్తి

విశాలాంధ్ర - పాలకొండ : ఖరీఫ్ సీజన్లో ధాన్యం సేకరణ ప్రక్రియ చాలా వేగవంతం గానూ సకాలంలో రైతుల బ్యాంక్ ఖాతాల్లో డబ్బులు జామ కావటం చాలా సంతోషదాయకమైన విషయం అని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి బుడితి అప్పలనాయుడు పేర్కొన్నారు శనివారం పాలకొండ మండలం తప్పటపల్లిగ్రామంలో రైతులతో కలిసి మాట్లాడేరు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం తరపున ప్రభుత్వం తీసుకున్న చర్యలను అభినందిస్తూ.ఈ సందర్భంగా రైతులు తమ సొంతంగా లేదా అద్దెకు వాహనాలను సమకూర్చుకొని ధాన్యం రవాణాకు ఏర్పాటు చేసుకోగా రవాణా చార్జీలు నేటికీ చెల్లించక పోవడంతో వస్తాయో రావో అనే ఆందోళనలలో రైతులు ఉన్నారని కావున రైతులకు రావలసిన ఇతర రాయితీలు అయిన రవాణా,హమాలి, గోనెలు(గన్ని బ్యాగ్స్),చార్జీలు తక్షణమే వాటిని విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుడితి అప్పలనాయుడు డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో కిమిడి రామ్మూర్తి నాయుడు, బుక్కపట్నం వెంకటరమణ, శేషగిరి,దాలినాయుడు తో పాటు రైతులుతదితరులు ఉన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర - బలిజిపేట : మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ప్రజా సంఘాల కార్యాలయములో కరపత్రం విడుదల చేసిన సిఐటియు, మధ్యాహ్నం భోజనం స్కూలు సీపర్లు నాయకులు, లక్ష్మమ్మ ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటీవల కాలంలో మన్యం జిల్లాలో మధ్యాహ్న భోజనం స్కూల్ సిపర్లు కుటుంబాల్ని రోడ్డుపై నేట్టేస్తున్నారు బలిసిపేట మండలం అరసాడ హైస్కూల్లో ఎలిమెంటరీ స్కూల్లో పనిచేసిన నిర్వహకులను రాజకీయ కక్ష సాధింపులు భాగంగా తొలగించడం అన్యాయం తొలగించిన వారిని విధుల్లో చేర్చుకోవాలి అని కోరారు హైకోర్టు ఆర్డర్ ప్రకారం బలిసిపేట మండలం అరసాడ హైస్కూలు ఎలిమెంటరీ స్కూల్ వంటమ్మలు స్కూల్ సీపర్లు పాతవారిని కొనసాగించాలి హైకోర్టు ఉత్తర్వులను కూడా ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవాలి సాలి చాలని జీతాలతో పెరుగుతున్న ధరలతో సబ్సిడీ గ్యాస్ లేక మౌలిక సదుపాయాలు లేక ఇన్సూరెన్స్ లేక ఇస్తామని యూనిఫామ్ గుర్తింపు కార్డులు రాక ఇబ్బందులు పడుతున్నామని కనీసం కూటమిప్రభుత్వం మాపై దయ తలచి మా సమస్యలు పరిష్కారం చేయాలని కోరుతూ పదో తేదీన కలెక్టర్ ఆఫీస్ దగ్గరిజరుగు ధర్నాని జయప్రదం చేయండి కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర - ఎటపాక : ఎటపాక మండలం నెల్లిపాక గ్రామంలో స్థానిక సర్పంచ్ కోర్సా భద్రమ్మ, పుట్టి రమాదేవి, అధ్యక్షతన జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి ఎటపాక మండల మహిళా విభాగ కమిటీ సభ్యులు ఎంపీటీసీ పాయం దేవి, మాజీ ఎంపీపీ పండా రమాదేవి , ఎంపీటీసీ పెనుబల్లి కృష్ణకుమారి, ఎటపాక మండలం మహిళా నాయకురాలు పునుగుపాటి స్రవంతి, తెలుగుదేశం పార్టీ ఎటపాక మండల మహిళ బీసీ సెల్ ఉపాధ్యక్షురాలు టేకుమల్ల రూప దేవి, ఈ కార్యక్రమాన్ని ఉద్దేశిస్తూ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో రాణించాలి,మహిళా సాధికారత ద్వారానే సాంఘిక,ఆర్థిక స్వావలంబన సాధ్యం. అవుతుందని, అన్నారు దేశంలో రోజు రోజుకీ మహిళలపై జరుగుతున్నటువంటి దాడులను కేంద్ర, రాష్ట్ర, ప్రభుత్వాలు మహిళలకు రక్షణగా బలమైన చట్టాలు అమలు చెయ్యాలని, ప్రభుత్వాలు,మహిళలను ఉద్యోగ, విద్య ,ఆర్థికంగా, రాజకీయంగా, అన్ని రంగాలలో స్థిరపడే విధంగా కేంద్ర, రాష్ట్ర, ప్రభుత్వాలు చూడాలని మనవి చేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలందరికీ శుభాకాంక్షలు. తెలియ జేస్తూ కేక్ కట్ చేసి మిఠాయిలు పంచుకున్నారు ఈ కార్యక్రమంలో తుమ్మలపల్లి జయమ్మ పుట్టి దివ్య, చింత సంధ్య,తెలుగుదేశం పార్టీ ఎటపాక మండల అధ్యక్షులు పుట్టి రమేష్ బాబు, మాణిక్యాల వీరాస్వామి, కొరసారాజు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోటు పుస్తకాలు పెన్నులు పంపిణీ

విశాలాంధ్ర - అనంతగిరి : ప్రపంచ మహిళ దినోత్సవం పురస్కరించుకొని మండల సమిద సంస్థ ఆధ్వర్యన ప్రభుత్వ ప్రైమరీ ప్రాథమిక ఆశ్రమ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 540 మంది పేద విద్యార్థిని విద్యార్థులకు ఆరులతో కూడిన వస్తులు. నోటు పుస్తకాలు పెన్నులు .టెక్స్ట్ బుక్స్. వేరుశనగ సక్కిళ్లు. గుడ్డే బిస్కెట్లు. సంతూర్ సబ్బులు పంపిణీ చేసినట్లు స్వచ్ఛంద సమస్థ మండల ప్రతినిధి వీరభద్ర రాజు అన్నారు సమస్త మండల ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డి. బుద్దురాజు ఆధ్వర్యన శనివారం ఈ కార్యక్రమం నిర్వహించమని తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనంతగిరి పంచాయతీ పరిధి లక్ష్మీపురం .పెద్దూరు. ఎగువశోభ పంచాయతీ పరిధి మరదగుడ. కాశీపట్నం పంచాయతీ పరిధి సార్వనిపాలెం .పల్లంవలస. బంగారంపెట. కొత్తూరు పంచాయతీ గంగవరం. దింసరాయి తదితర పాఠశాలల విద్యార్థిని విద్యార్థులకు అందజేశామని ఆయన అన్నారు చదువుతోపాటు నాణ్యమైన ఆహార పదార్థాలు తీసుకున్నప్పుడే విద్యార్థులు పుష్టిగా ఆరోగ్యకరంగా ఉంటారని అది సగ పాఠశాల యాజమాన్యం ప్రభుత్వం అమలు చేస్తున్న పౌష్టికాహారాన్ని క్రమం తప్పకుండా అందించాలనా కోరారు అంత కాకుండా తమ సంస్థ గత పది ఏళ్ల నుండి పాఠశాలలలో చదువుతున్న విద్యార్థులకు ఇటువంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మండల సమిద సంస్థ సిబ్బంది జె.సింహాద్రి. ఎస్.అప్పలరాజు. పాంగి ప్రసాద్. కర్రీ.నాగేశ్వరరావు. అశ్విని. విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులు చేసిన తప్పిదానికి తనపై చర్యలు ఏమిటని ప్రశ్నిస్తున్న జోగమ్మపేట సర్పంచ్

విశాలాంధ్ర - సీతానగరం : టైడ్ అన్ టైడ్ గ్రాంట్స్ వాటియొక్క హెడ్స్ కోసం తెలియకపోవచ్చు వెండర్ అండ్ టెండర్లు ఏప్రాప్తికి ఉపయోగించవలనో తెలియకపోవచ్చును కానీ ప్రజాప్రతినిధులను గైడ్ చేయాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శి ఉందని వారిపై చర్యలు తీసుకోకుండా తన చెక్ పవర్ రద్దు చేయడం వెంటనే జోగంపేట సర్పంచ్ సింహాచలం ప్రశ్నిస్తున్నారు. తమ పంచాయతీ పంచాయతీ మరియు సచివాలయం హెడ్ క్వార్టర్స్ లో సీనియర్ పంచాయతీ కార్యదర్శిని నియమించాల్సి ఉన్న అధికారులు తప్పిదంతో అనుభవం లేని గ్రేడ్ 5కార్యదర్శిని నియమించి, నాలుగేళ్లలో సీనియర్ కార్యదర్శిలను డిడి ఓ లుగా కొనసాగించడంపై ప్రశ్నించారు.తానుచేసిన పనిని నిబంధనలకు విరుద్ధమని ,రూల్స్ ట్రెజరీ హెడ్స్ చెప్పలేదని , ఆడిటర్ కూడా అభ్యంతరం చెప్పలేదన్నారు.గ్రామ నిధులతోనే కరోనా టైమ్ లోకూడా మండలంలో ఏపంచాయతీ సహకరించకపోయిన తన పంచాయతీలో క్వారింటీన్ సెంటరుకు సహకరించా నన్నారు. తానుచేసిన ప్రతి పనికి ఎం బుక్కులున్నాయని, ఆడిట్ చేయడం జరిగిందని, నిధుల దుర్వినియోగం ఎలాఅవుతుందని ప్రశ్నించారు. వాస్తవాలను అధికారులు గుర్తించి తనకు న్యాయం చేయాలని ఆయన కోరారు.

లోక్ అదాలత్‌లో 424 కేసులు పరిష్కారం



విశాలాంధ్ర - బెలగాం : జాతీయ లోక్ అదాలత్ ద్వారా పెండింగ్ లో ఉన్న కేసులను సత్వరం పరిష్కరించుకోవడానికి అవకాశం ఉంటుందని పార్వతీపురం రెండవ అదనపు జిల్లా జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ అధ్యక్షులు ఎస్. దామోదరరావు అన్నారు. శనివారం జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని పార్వతీపురం జిల్లా కోర్టు ఆవరణలో నిర్వహించారు. ఈ లోక్ అదాలత్ లో మోటారు వెహికల్ ఏక్సిడెంట్ కేసులు 06, అమలు దావాలు 22, ప్రానోట్ దావాలు 7, టైటిల్ దావాలు 6, ఫైనల్ డిక్రీ పిటిషన్ 1, ఎక్సైజ్ కేసులు 45, చెక్ బౌన్స్ కేసులు 5, కుటుంబ తగాదా కేసులు 4, ఎస్టీసీలు 272, ప్రిలిటిగేషన్ కేసులు 4, క్రిమినల్ కాంపౌండ్ బుల్ కేసులు 53 మొత్తం 424 కేసులను జాతీయ లోక్ అదాలత్ ద్వారా రాజీ చేయడం జరిగిందని 2011 నుండి పెండింగ్ లో ఉన్న సివిల్ దావా రాజీ చేయడం జరిగిందని రెండవ అదనపు జిల్లా జడ్జి ఎస్. దామోదరరావు వివరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలాకాలంగా పెండింగ్ లో ఉన్న కేసులను సామరస్యపూర్వకంగా పరిష్కరించుకునేందుకు జాతీయ లోక్ అదాలత్ ను నిర్వహించడం జరిగిందన్నారు. జాతీయ లోక్ అదాలత్ ద్వారా పెండింగ్‌లో ఉన్న వివాహ, ఆస్తి వివాదాలు, మోటారు ప్రమాద క్లయిమ్లు, భూసేకరణ పరిహారం, సర్వీస్ లేబర్ కు సంబంధించిన కేసులతో సహా సెటిల్మెంట్ అంశాలను కలిగి ఉన్న కేసులు త్వరితగతిన పరిష్కరించేందుకు వీలు కల్పిస్తామని పేర్కొన్నారు. ఎంతో దూరం నుండి కక్షిదారులు కోర్టులకు వస్తున్నారని, లోక్ అదాలత్ లో కేసుల పరిష్కారం వల్ల వారికి మానసిక వత్తిడి తగ్గడమే కాకుండా, ఖర్చులు కూడా తగ్గుతాయన్నారు. ఇలాంటి లోక్ అదాలత్ కార్యక్రమాలను ప్రతీ కక్షిదారుడు సద్వినియోగం చేసుకుని పెండింగ్ లో ఉన్న కేసుల నుండి విముక్తి పొందాలని సూచించారు. ఈకార్యక్రమంలో అడిషనల్ జుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ జె. సౌమ్య జాస్పిన్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు నల్ల శ్రీనివాసరావు, లోక్ అదాలత్ మెంబర్ టి. జోగారావు, పేనల్ అడ్వకేట్ గొర్లి వెంకట్రావు, ఎపిపి చంద్రకుమార్, న్యాయవాదులు రెడ్డి శశిభూషణరావు, అధిక సంఖ్యలో కక్షిదారులు పాల్గొన్నారు.

చందాలు వేసుకుని రోడ్డు నిర్మాణం..మూడు నెలలైనా అమలు కానీ ఉపముఖ్యమంత్రి హామీలు

విశాలాంధ్ర - అనంతగిరి : పివిటిజిల సంక్షేమనికి పెద్దపీట వేస్తున్నమన కేంద్ర రాష్ట్ర ఇచ్చిన హామీలు పివిటిలకు శాపంగా మారాయి స్వతంత్రం వచ్చి ఏళ్లు గడుస్తున్నప్పటికీ కనీస మౌలిక వసతులు అందని ద్రాక్షగా మిగిలాయి దీంతో ఇంటింటా సందలు వేసుకొని రోడ్డు ఏర్పాటుకు నడుం బిగించిన పిటీజీల ఐక్యతకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తలంచుకోవాల్సిన పరిస్థితి డోలిమోత రహిత ఆంధ్ర ప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా వక్క పంచాయతీలో మూడు నెలల క్రితం పర్యటనలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఇచ్చిన హామీ అమ్మలకు నోసుకొని దుస్థితి అయితే మండలనికి మారుమూల కివర్ల పంచాయతీ పరిధి కొండ శిఖరు నక్కులమామిడి పివిటిజి లు కనీస రోడ్డు సౌకర్యం లేకపోవడంతో ఎలాగైనా రోడ్డు సౌకర్యాం ఏర్పాటు చేసుకొవలన్న తపనతో ముందుకు వచ్చి 63.పివిటిజి కుటుంబాలు ఇంటింటికి ఐదువేలు రూపాయలు చొప్పున సందలు వేసుకుని మూడు

కిలోమీటర్లు రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టమని గ్రామస్తులు వి.రాజు వి.ఈశ్వరరావు కిల్లో. కామేశ్వరావు లు అన్నారు రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు కోరుతూ రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్.కు కలిసి లిఖితపూర్వకంగా విన్నవించామని అంత కాకుండా జిల్లా కలెక్టర్ ఐటిడిఎ. పిఓ గిరిజన మంత్రులకు కలిసి విన్నవించమని అయినప్పటికీ కూడా కనీసం తమ గోడు నాదుడే కరుయరని దీనితో తమ గ్రామానికి ఇల్లు నిర్మించుకోలంటే సామాగ్రి తోపాటు నిత్యవసర సరుకులు భుజం పైన మోసుకొని మూడు కిలోమీటర్లు ఎత్తైన కొండ కోనల నడుము నుండి తరలించవలసి వస్తుందని నాలుగు నెలల క్రితం విద్యుత్ స్తంభాలు కూడా మోయవలసి వచ్చిందని. అలాగే గర్భిణీ. బాలింత అనారోగ్యాలకు గురైన రోగులకు వైద్యం కోసం డోలు సహాయంతో కివర్ల మెయిన్ రోడ్డు వరకు తరలిస్తున్నామని ఇది ఇలానప్పటికీ కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన జన్ మన్ పథకం కింద మంజూరైన గృహాలు నిర్మించుకునేందుకు అవసరమైన సామాగ్రి రవాణా కొరకు తీవ్ర ఇబ్బందికరంగా ఉందని ఆలోచనతోనే ముందుకు వచ్చి ఇంటింట సందలు వేసుకుని మూడు కిలోమీటర్ కివర్ల మెయిన్ రోడ్డు నుండి తమ గ్రామం వరకు జెసిబి ద్వారా రోడ్డు పనులు మొదలుపెట్టి నేటికి వారం రోజులు కావస్తున్న మండల సంబంధిత అధికారులు ప్రజాప్రతినిధులు పట్టించుకున్న దాఖలు లేదని వారు ఆరోపించారు ఇప్పటికైనా సరే ప్రభుత్వం తక్షణమే స్పందించి రోడ్డు ఏర్పాటుకు నిధులు మంజూరు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

విశాలాంధ్ర - గంగవరం : పోస్టల్, పోలీస్ శాఖల ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ పోస్టమాస్టర్ వై మోహన్ శివప్రసాద్ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలోనూ పోటీ పడాలని అన్నారు. ప్రభుత్వాలు కూడా మహిళా సాధికారతకు సహకారం అందించాలన్నారు. ఈ సందర్భంగా మహిళల అభ్యుదానికి పాటుపడిన మహిళా నేతల గురించి పారిశ్రామికవేత్తల గురించి ఆయన వివరించారు. అంబేద్కర్ ఎంతో పాటు పడ్డారని మహిళా రిజర్వేషన్లు అయిన వల్లే సాధ్యమయ్యాయి అని అన్నారు. కేక్ కట్ చేసి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అలాగే మహిళా ఉద్యోగులను ఘనంగా సన్మానించారు. అలాగే ఏఎస్ఐ రాంబాబు ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. సువర్ణ, సత్కృప, వర్షిత, కేశవ, సతీష్, తరుణ్, శ్రీనివాస్, పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల్లో దళితులకు తీవ్ర అన్యాయం

విశాలాంధ్ర - జియ్యమ్మవలస : మండలంలో జరిగే మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనుల్లో దళితులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని సీపీఐ జిల్లా కార్యదర్శి కొల్లి గంగు నాయుడు అన్నారు. సిపిఎం పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈనెల 17వ ప్రజా సమస్యలపై అధ్యయనం సందర్భంగా జియ్యమ్మ వలస మండలంలోని దళిత వాడను ఆయన సందర్శించార. ఈ సందర్భంగా దళితులు కొన్ని సమస్యలు ఆయన దృష్టికి తీసుకురాగా గత రెండు వారాలుగా ఉపాధి హామీ పనులలో దళితులకు రెండు వారాల నుంచి పని కల్పించడం లేదని రైతులు పొలాలలో ఫారం పాండ్లు నిర్మించాలని దానికి రైతులు అంగీకరించకడం అంగీకరించడం దీనికి రైతులు అధికారుల దృష్టికి తీసుకువెళ్తే రైతులను ఒప్పించే బాధ్యత మీదేనని అధికారులు చెప్పడంతో ఆయన దీనిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కూలీలకు కావాల్సిన పనులు ఇవ్వాలని చెబుతుంటే అధికారులు దానిని పట్టించుకోకపోవడం దారుణమని అంతేకాకుండా మంచి నీటి సౌకర్యం లేకపోవడంతో తక్షణమే మంచినీటి సౌకర్యం కల్పించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి కూరంగి సీతారాం మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధితో మహిళలు అన్ని రంగాల్లో ఆర్థిక పురోగతి సాధించి సగర్వంగా జీవించాలి

విశాలాంధ్ర - దేవీపట్నం : అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని దేవిపట్నం మండలం ఇందుకూరులో ఏర్పాటు చేసిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలో పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాజీ ఎంపిటిసి మాగాపు కుమారి మాట్లాడుతూ మహిళల సాధికారిక దిశగా మన అందరి కర్తవ్యాన్ని గుర్తుచేసే రోజు ఈరోజు కావడం విశేషమన్నారు.. మహిళలు అన్ని రంగాల్లోకి ముందుకు రావాలంటే, విద్యా, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో సరైన భాగస్వామ్యం అనేది తప్పనిసరి అని ఆమె పేర్కొన్నారు.. మహిళా హక్కులతో పాటు, సమానత్వం, సాధికారత సాధించడం కోసం అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరుపుకోవడం ముఖ్య ఉద్దేశమని.. సమాజంలో మనం ఒక మహిళను బలపరిస్తే, ఆమె కుటుంబాన్ని బలపరుస్తుందని, ఒక కుటుంబం బలంగా ఉంటే సమాజం అభివృద్ధి చెందుతుందనే నినాదంతో మనమందరం ముందుకు వెళ్లినప్పుడే ఈ సమాజంలో మనమందరం ముందుకు వెళ్తామని అన్నారు..76 ఏళ్ల స్వాతంత్ర దేశంలో మనువాద అకృత్యాలైన, సతీసహగమనం, బాల్యవివాహాలు వంటి సామాజిక దురాచారాల నుండి బయటపడి, నేడు సమాజంలో స్త్రీ ఒక ప్రత్యేక గుర్తింపును సాధించుటకు కృషి చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు..నా సహచర తోబుట్టువులు, మహిళలకి పేరుపేరునా అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేసారు..అనంతరం మాజీ ఎంపిటిసి మాగాపు కుమారి మాజీ సర్పంచ్ కందికొండ గౌరీస్వారి లను దుశ్శాలువాలతో సత్కరించి కేకు కట్ చేసి మిఠాయిలను పంచారు.ఈ కార్యక్రమంలో మండల క్లస్టర్ ఇంచార్జి%ఉ% రాష్ట్రతెలుగు రైతు కార్యనిర్వాహక కార్యదర్శి మాగాకు బాబురావు, రాష్ట్రీ ఎస్సీ సెల్ కార్య నిర్వాహక కార్యదర్శి గోళ్ళ చంటిబాబు, రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి చవళం శివరామకృష్ణ,మాజీ మండల అధ్యక్షుడు తైలం గంగాధర్ రావు, నియోజకవర్గ మీడియా కోఆర్డినేటర్ కేశవరపు చంద్రకుమార్(పండు),మాజీ ఎంపీటీసీలు చారపు రాంబాబు, ముచ్చు చిన్ని,ముచ్చు బాబురావు,ఈరేటి బ్రాహ్మజీ, పాతాళ పండు,దబ్బా నాని,పుట్టపల్లి మల్లేశ్వరరావు, ఈరేటి సుజాత, ఈరేటి వరలక్ష్మి, ఈరేటి శివ పార్వతి, జమ్మి కవిత, మూలవర్తి రమాదేవి, ఈరేటి సీతయమ్మ, జళ్ళుమూరి యజ్ఞవతి,గోడలి నీలవేణి, ఛత్రుచర్ల మంగాదేవి,కురుపల్లి దేవి, తైనా గిరి,తైనా సత్యవతి మరియు కార్యకర్తలు, తెలుగుమహిళలు భారీగా పాల్గొన్నారు.

స్త్రీలు అన్ని రంగాల్లో ముందండాలి

విశాలాంధ్ర - హుకుంపేట : మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని అరుకు ఎమ్మెల్యే రేగం మత్య లింగం కోరారు. మండల కేంద్రంలో గల ఎంపీడీవో కార్యాలయం లో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుక లలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా వైద్య ఉద్యోగ రాజకీయ రంగాలలో పురుషులకు ఏమాత్రం తీసిపోకుండా స్త్రీలు రాణిస్తున్నా రని, అలాగే ఆదివాసి ప్రాంతాలలో స్త్రీలు కూడా ఉన్నత విద్యలు చదు వుకుని అన్ని రంగాల్లో ముందంజ లొ ఉండాలని సూచించారు. మన వ్యక్తిగత జీవితంలో ఎన్నో కష్టాలను ఎదుర్కొని సమాజంలోని అసమాన తలకు వ్యతిరేకంగా ధైర్యంగా పోరా డి చివరకు దేశ అత్యున్నత పీఠ నిరోహించిన మన భారత రాష్ట్రప తి ద్రౌపతి ముర్ము మహిళలకు స్ఫూర్తినివ్వడమే కాకుండా నిజమై న మహిళా సాధికారతకు నిర్వచ నం గా నిలిచిందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ కొమ్మ రమ వై ఎస్ ఆర్ జిల్లా వైస్ ప్రెసిడెం ట్ బత్తిరి రవి ప్రసాద్, వైసిపి మండ ల పార్టీ ప్రెసిడెంట్ పాంగి అనిల్, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు కాకర బొంజుబాబు మరియు పలువురు సర్పంచులు ఎంపీటీసీలు సి ఐ సన్యాసినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

హుకుంపేట : మండల కేంద్రంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం స్థానిక సర్పంచ్ పూర్ణిమ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించరు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అరకు ఎమ్మెల్యే రేగం మత్య లింగం విచ్చేసి మహిళలను ఉద్దే శించి మాట్లాడారు. మహిళలు అన్ని రంగాలలో ఉద్యోగ, రాజకీయ వ్యాపార రంగంలో అభివృద్ధి చెందాలని, ఈనాటికి మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాలలో పోటీ ని స్తున్నారని ఆయన అన్నారు. ఎమ్మెల్యే చేతు లు మీదుగా ఉత్తమ ఉద్యోగులు కు సన్మానం కార్యక్రమం నిర్వహించ డం జరిగింది.ఈ కార్యక్రమంలో మండలం తాసిల్దార్ ప్రకాష్, సీఐ సన్యాసినాయుడు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ సౌజన్య,ఉప్ప డాక్టర్ రేఖ, డిప్యూటీ డైరెక్టర్ రజిని, వైస్ ఎంపీపీ ప్రియాంక, మండలం మహిళా ఉద్యోగులు, ప్రజా ప్రతినిధులు, పాల్గొన్నారు.

సమాజ నిర్మాణంలో మహిళదే ముఖ్య భూమిక

విశాలాంధ్ర - కూనవరం : యం.పి.పి.ఎస్. జగ్గవరం కాలనీ పాఠశాలలో మండల మహిళా కమిటీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కూనవరం ఎస్ ఐ.శ్రీమతి లతశ్రీ హాజరైనారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్త్రీ అభివృద్ధితోనే సమాజ మనుగడ, పురోగతి ఉంటుదని,ప్రపంచ అభివృద్ధి కూడా మహిళల అభివృద్ధితోనే ముడిపడి ఉందని, మహిళా సాధికారత అంటే మహిళలు స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకోవడం ద్వారా అభివృద్ధిలో ముందుకు సాగుతుందని,మహిళాలు అన్ని రంగాలలో ముందుండాలని తెలిపారు. ప్రతి కుటుంబంలో అబ్బాయి తో సమానంగా ఆడపిల్లలను చదివించాలని విద్య ద్వారా వారి మానసిక వికాసం పెంపొందుతుందని తద్వారా ఆరోగ్యకరమైన సమాజం నిర్మితమవుతుందని ఆమె అన్నారు. అనంతరం మహిళా ప్రతినిధులు మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 77 ఏండ్లు పూర్తి అవుతున్నా ఆశించిన స్థాయిలో అభివృద్ధి చెందలేదని,నేటి పాలకుల పాలనలో మాత్రం మన భారత్ లింగ సమానత్వం లో 129 స్థానం లో నిలవడం అత్యంత బాధాకరమైన విషయం. ప్రతి రోజూ దేశంలో మహిళాలు లైంగిక దాడులు, రకరకాల వివక్షతకు, అణిచివేతకు గురవుతున్నారనీ, దేశ రాజధాని న్యూఢిల్లీ ఆత్యాచారాల రాజధానిగా వార్తల్లో నిలుస్తోందనీ,మహిళాలపై జరుగుతున్న క్రైమ్ రేటు పెరగుతుందని ఇది సమాజాభివృద్ధికి మంచిది కాదని అన్నారు. ఈ కార్యక్రమంలో సోడే లక్ష్మి ధనలక్ష్మి అన్నపూర్ణ రమ్య స్వరాజ్యం నీలవేణి దుర్గ కుమారి తదితరులు పాల్గొన్నారు.

మహిళా దినోత్సవ స్ఫూర్తితో హక్కుల సాధనకై సిద్ధం కావాలి

విశాలాంధ్ర - రాజవొమ్మంగి : అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా స్థానిక మండల విద్యా వనరుల కేంద్రం రాజవొమ్మంగి నందు మొదటిగా తొలితరం మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే గారి చిత్రపటానికి ముఖ్య అతిథిగా హాజరైన రాజవమ్మంగి మండల అటవీ శాఖ అధికారి శ్రీమతి గుమ్మడి ఉషారాణి గారు మరియు మండల విద్యాశాఖ అధికారి- 2 ఇరువురు సావిత్రిబాయి పూలే గారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనమైన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి యూటీఎఫ్, సిఐటీయూ ప్రజా సంఘాల నేతలు మరియు మహిళ ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో మహిళలు ఉత్సాహంగా పలు రకాల ఆటల పోటీలు మరియు సంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొన్నారు, ఈ సందర్భంగా రేంజర్ ఉషారాణి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో ఉన్నతంగా రాణించాలని మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను మహిళలందరూ ధైర్యంగా ఎదుర్కోవాలని పిలుపునిచారు. అనంతరం ఆమె సీనియర్ మహిళా ఉపాధ్యాయులను సత్కరించిన పలు రకాల ఆటల పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందజేశారు,ఈ కార్యక్రమంలో మండల మహిళ ఉపాధ్యాయులు అందరూ పాల్గొన్నారు.

జిల్లాకు వచ్చిన 35 మంది నూతన ప్రొబేషనరీ ఎస్ఐలు

విశాలాంధ్ర - పార్వతీపురం : అనంతపురం పోలీసు శిక్షణ కళాశాలలో శిక్షణ పూర్తిచేసుకున్న గుంటూరు, కర్నూలు రేంజ్‌కి సంబంధించిన 35 మంది నూతన ప్రొబేషనరీ ఎస్సైలు ను ప్రాక్టికల్ శిక్షణ నిమిత్తం పార్వతీపురం మన్యం జిల్లాకు కేటాయించారని జిల్లా ఎస్పీ మాధవ్ రెడ్డి తెలిపారు. వారంతా జిల్లా పోలీస్ కార్యాలయం నందు జిల్లా ఎస్పీ ఎస్..వి.మాధవ్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. నూతనంగా పోలీస్ శాఖలోకి అడుగుపెడుతున్న ప్రొబేషనరీ ఎస్ఐలకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. జిల్లా ఎస్పీవారందరితో మాట్లాడి శిక్షణ గురించి అడిగి తెలుసుకున్నారు. క్షేత్ర స్థాయిలో నిర్వహించాల్సిన విధులపై అవగాహనా కల్పించేందుకు వారికి పోలీస్ స్టేషన్లను కేటాయించారు.విధి నిర్వహణలో నిర్భయంగా, నిష్పక్షపాతంగా, క్రమశిక్షణ, నిజాయతీ, పారదర్శకత, జవాబుదారీతనం పాటిస్తూ, ప్రజలకు అత్యుత్తమ సేవలు అందిస్తూ, పోలీస్ శాఖ ప్రతిష్టను మరింత పెంచేలా విధులను నిర్వర్తించాలని సూచించారు. ముఖ్యంగా ప్రతి ఒక్కరూ ఈ ప్రాక్టికల్ శిక్షణలో టెక్నాలజీని ఉపయోగించి ఉత్తమ ఫలితాలను రాబట్టి ప్రజలకు మరింత సేవ చేసేలాగా చూడాలని, ఫిర్యాదుదారులతో మర్యాదగా ప్రవర్తించాలని, ఎఫ్.ఐ.ఆర్ ధర్యాప్తుకు సంబంధించిన రికార్డులను రాయడం గురించి క్షుణ్ణంగా తెలుసుకోవాలి, కేసులను ఏవిధంగా చేధించాలి, సి.సి.టి.ఎన్.ఎస్., డ్రోన్స్‌ను ఉపయోగించడం, పెట్రోలింగ్, సి.సి.కెమెరాలను ఉపయోగించు విధానం గురించి, పహరా బీట్ గురించి, ఎన్.డి.పి.ఎస్. కేసులలో చేయవలసిన విధుల గురించి, కేసు డైరీ రాయడం, నేర స్థలాన్ని ఏవిధంగా పరిశోధించాలి, బంధోబస్త్ ఏవిధంగా వేయాలి, ఏ విధంగా నిర్వహించాలి, పోలీస్ స్టేషన్ నిర్వహణ, విధులు, ముఖ్యమైన కేసుల దర్యాప్తు, స్టేషన్లో నిర్వహిస్తున్న వివిధ క్రైమ్ రికార్డ్స్ లను ఏ విధంగా నిర్వహించాలి మొదలగు అంశాల గురించి క్షుణ్ణంగా నేర్చుకోవాలని, ఎక్కడా ఏవిధమైన అనుమానం వచ్చిన వెంటనే సీనియర్ అదికారులను అడిగి తెలుసుకుని నివృత్తి చేసుకోవాలని తెలియజేశారు.

మహిళలు చదువుపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలి

విశాలాంధ్ర - కొయ్యూరు : మహిళలు అన్ని రంగాల్లో ముందంజలో ఉంటున్నారని విద్య అనే ఆయుధంతో అడ్డంకులను సమర్ధవంతంగా ఎదుర్కొంటున్నారని విద్యార్థులందరూ చదువు పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని మర్రిపాలెం మహిళ డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ కే సుధా పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలు మర్రిపాలెం డిగ్రీ కాలేజీలో అత్యంత వైభవంగా నిర్వహించారు ఈ సందర్భంగా ప్రిన్సిపల్ కే సుధా మాట్లాడుతూ మహిళలకు చదువు ఆయుధం లాంటిదని దానిపై విద్యార్థులందరూ మక్కువతో చదవాలని ఆమె కోరారు. అనంతరం కళాశాల వైస్ ప్రిన్సిపల్ వికేటి మహాలక్ష్మి మాట్లాడుతూ నేటి సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో ముందంజ ఉన్నప్పటికీ సమాజంలో స్త్రీ పురుష సమానత్వం

ఇంకా పూర్తిగా లేదన్నారు. నేటి సమాజానికి అద్దం పట్టే సమకాలిన స్త్రీ వాద కథనానికి సాహిత్యం గురించి వివరించారు. అలాగే మహిళా సాధికారత సంస్థ కన్వీనర్ పి మంగమ్మ మాట్లాడుతూ స్త్రీలు ఆర్థికంగా బలోపేతం అయితేనే సాధికారత సాధించడానికి అవకాశం ఏర్పడుతుందని కావున అందరూ విద్య పట్ల శ్రద్ధ వహించాలని తెలిపారు వృక్షశాస్త్ర ఉపన్యాసకులు కుమారి మాట్లాడుతూ మహిళా ప్రిన్సిపల్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ సభ జరగడం ఎంతో ఆనందదాయకమని అన్నారు. రసాయన శాస్త్ర ఉపన్యాసకులు ఎం శ్రీవిద్య ఆంగ్ల ఉపన్యాసకులు పుష్ప ప్రసంగిస్తూ విద్యార్థులు ఎలాంటి కష్టతరంలోనైనా పీజీ వరకు చదువు కొనసా గించాలని మహిళలు అభ్యున్నతికి ఏకైక సాధనం చదివేనని వారు పిలుపునిచ్చారు అలాగే ఎందరో సంఘసంస్కర్తలు కృషి ఫలితంగానే స్త్రీలు ఈనాటికీ ఇలా అభివృద్ధి చెందారని దీనిని కాపాడుకోవాల్సిన అవసరం నేటి యువతరం పై ఉందని ప్రతి ఒక్కరు బాధ్యతతో మెలగాలని తెలిపారు. అనంతరం మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు ప్రిన్సిపల్ కే సుధా ఇతర ఉపన్యాసకులు చేతులు మీదుగా బహుమతులు ప్రధానం చేశారు.

చికత్స పొందుతున్న వ్యక్తి మృతి



విశాలాంధ్ర - మక్కువ : మన్యం జిల్లా మండలంలోని పాయికపాడు గ్రామానికి చెందిన సామంతుల స్వామి నాయుడు (వయసు 29) తండ్రి వెంకటరమణ మార్చి ఆరో తారీఖున ఉదయం గడ్డి మందు తాగినాడు వెంటనే విజయ నగరం ఆసుపత్రికి తరలించడం జరిగింది చికిత్స పొందుతూ శనివారం నాడు ఉదయం మరణించి నట్లు మృతుడు భార్య సామంతుల శిరీష పోలీసులకు ఫిర్యాదు చేయడం జరిగినది, మామ మందలించాడనే ఆవేశంలో గడ్డి మందు తాగినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మక్కువ ఏఎస్ఐ ఎం శ్రీనివాసరావు తెలిపారు.

బూర్జలో అభివృద్ధి పనులు

విశాలాంధ్ర - సీతానగరం: శాసనసభ్యులు బోనెల విజయచంద్ర ఆధ్వర్యంలో ఎన్నడూ లేనివిధంగా బూర్జగ్రామంలో అభివృద్ధి పనులు చేపట్టినట్లు గ్రామ నాయకులు తెలిపారు. సిసి రోడ్ల నిర్మాణాలు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ప్రహరీ నిర్మాణం తదితర పనులు చేయడం జరిగిందన్నారు. గ్రామంలో ప్రధానసమస్యయినా మంచినీటి కుళాయిలు మంజూరుకు ప్రతిపాదనలు పంపడం జరిగిందన్నారు. గ్రామంలో అభివృద్ధి సంక్షేమానికి ఎమ్మెల్యే పెద్దపేట వేస్తున్నట్లు టిడిపినాయకులు బలరాం నాయుడు, నీరస జ్యోతి చంద్రశేఖర్ తదితరులు తెలిపారు.

మహిళలు... మహారాణులు

అన్ని రంగాలలో రాణిస్తున్న అతివలు

వివిధ రంగాలలో ప్రతిభావంతులుగా రాణిస్తున్న మహిళలపై అంతర్జాతీయ మహిళా దినోత్సవ ప్రత్యేక కథనం.

విశాలాంధ్ర - చింతపల్లి: ప్రస్తుత సమాజంలో మగవారికి దీటుగా మహిళలు కూడా అన్ని రంగాలలో రాణిస్తున్నారు. మహిళలూ... మహారాణులు అనే సూక్తికి ఏమాత్రం తీసుపోని విధంగా మహిళలు నేడు అన్ని రంగాలలో ముందుంటున్నారు. చింతపల్లి మండలానికి సంబంధించి రక్షణ రంగం నుంచి రాజకీయ రంగం వరకు, అదే క్రమంలో విద్యారంగం నుంచి వైద్యరంగం వరకు, ఉద్యాన శాస్త్రవేత్తల నుంచి బాల్య వివాహాల నిర్మూలన, బాల బాలికలు, గర్భిణీలు, బాలింతలకు పోషకాహారం అందచేసే ప్రక్రియ వరకు మహిళలు తమ ప్రతిభను కనబరిస్తూ ముందుకు దూసుకుపోతున్నారు. వీరిలో రక్షణ రంగం నుంచి సిఆర్పిఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ డి వినీత, రాజకీయ రంగం నుంచి స్థానిక ఎంపీపీ కోరాబు అనూష దేవి, విద్యారంగం నుంచి స్థానిక ఏ టి డబ్ల్యూ ఓ బలిరెడ్డి నాగ జయలక్ష్మి, ప్రాంతీయ ఆసుపత్రి సూపరిండెండెంట్ గా ఈ మధ్యనే బాధ్యతలు స్వీకరించిన ఇందిర ప్రియాంక, ఉద్యాన అధికారి నుంచి ఉద్యాన అధిపతి గా చెట్టి బిందు, అదేవిధంగా బాల్యవివాహాల నిర్మూలనకు, బాల బాలికలు, గర్భిణీలు, బాలింతల సంరక్షణకు పాటుపడుతున్న ఐ సి డి ఎస్ సి డి పి ఓ గుబ్బల వెంకటరమణ యొక్క ప్రస్థానం చింతలపల్లి నుంచి అంచలంచలుగా పదోన్నతులు పొందుతూ చింతపల్లి మండలంలో అనేక సేవలు అందిస్తున్నారు.

ఈ విధంగా ఎంతో మంది మహిళలు తాము ఎంచుకున్న రంగాలలో రాణిస్తూ మహిళా చైతన్యాన్ని ముందుకు తీసుకువెళు_న్నారు. అటువంటి వారందరికీ అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని "విశాలాంధ్ర" ప్రత్యేక అభినందనలు తెలియపరుచుకుంటుంది.

రక్షణ రంగంలోనూ మగవారికి దీటుగా మహిళలు రాణిస్తున్నారు. పోలీసు వ్యవస్థలో సిఆర్పిఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్‌గా డివినీత ధైర్య సాహసాలను ప్రదర్శిస్తున్నారు. అసిస్టెంట్ కమాండెంట్ స్థాయిలో సేవలందిస్తున్న ఆమె మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వారు.

కోరాబు అంగద రావు సుజాతల గారాలపట్టి అనూష దేవి, నేడు చింతపల్లి ఎంపీపీగా రాజకీయ రంగంలో రాణిస్తున్నారు. అవివాహిత అయిన అనూష దేవి తాజంగి ఎంపీటీసీగా రాజకీయ అరంగేట్రం చేసి తొలి ప్రయత్నం లోనే ఎంపీటీసీగా విజయం సాధించి అనూహ్యంగా ఎంపీపీ పగ్గాలు అందుకని ఎంపీపీ కావాలన్న తన తండ్రి కలను సాకారం చేయడంతో పాటు మండల అభివృద్ధిలో తనదైన ముద్ర వేశారు.

కత్తి మీద స్వాము లాంటి వైద్యరంగంలోనూ మహిళలు ముందుంటున్నారు. స్థానిక వంద పడకల ప్రాంతీయ ఆసుపత్రిలో సూపరిండెండెంట్ గా డాక్టర్ ఇందిరా ప్రియాంక నియమితులై ప్రజలకు ఎనలేని సేవలు అందిస్తున్నారు.

గతంలో పాడేరు శాసన సభ్యురాలుగా సేవలందించిన కొట్టగుళ్ళి భాగ్యలక్ష్మి. ప్రజా సమస్యలపై నిత్యం పోరాడుతూ, ప్రజా పోరాటాలలో ముందుంటూ ప్రతిపక్ష వైసీపీ నాయకురాలుగా తనదైన ప్రత్యేక ముద్ర వేసుకొని రాజకీయరంగంలో రాణిస్తున్నారు.

మన్యప్రాంత విద్యార్థులలో ప్రతిభను వెలికి తీయాలనే తపనతో విద్యార్థులలో ఉన్న ప్రతిభను గుర్తించేందుకు తపన పడుతున్న మహిళ స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రధానాచార్యురాలు డాక్టర్ ఎం విజయభారతి.

తూర్పుగోదావరి జిల్లా చింతలపల్లి లో పుట్టి పెరిగిన గుబ్బల వెంకటరమణ. తల్లిదండ్రుల సహకారం, భర్త ప్రోత్సాహంతో అనేక ప్రాంతాలలో ఐసిడిఎస్ ఏ సి డి పి ఓ గా, సిడిపిఓ గా విశేష సేవలు అందించి అనేక అవార్డులు పొందారు. నేడు చింతపల్లిలో ఐసిడిఎస్ సిడిపిఓగా సేవలు అందిస్తున్నారు. ఈమె ప్రస్థానం చింతలపల్లి లో మొదలై నేటికీ చింతపల్లి లో కొనసాగుతుంది.

విద్యారంగంలో రాణించి నేడు చింతపల్లి, జికె విధి, జీ మాడుగుల మండలాలకు సంబంధించి ఏ టి డబ్ల్యూ ఓ గా బలిరెడ్డి నాగ జయలక్ష్మి విశేష సేవలు అందిస్తున్నారు

ఉద్యాన శాస్త్రవేత్తగా నియమితులైన చెట్టి బిందు అంచెలంచెలుగా తన ప్రతిభకు పదును పెడుతూ చింతపల్లిలో ఉద్యాన అధిపతిగా సేవలు అందిస్తున్నారు.

స్త్రీ అంటే శక్తి స్వరూపిణి

ఓర్పులో నేర్పులో తనకి తానే తాటి స్త్రీ

విశాలాంధ్ర - ఎటపాక: స్త్రీ అంటేనే శక్తి స్వరూపిణి తల్లిగా, భార్యగా, స్నేహితురాలిగా, అలా ఆమె పోషించే పాత్ర అనిర్వచ నీయం ఎక్కడైతే మహిళలు గౌరవిస్తారో ఆ సమాజం సమున్నతంగా ఉంటుంది. సమాజం బాగుంటేనే యావత్ ప్రపంచం పురోభివృద్ధి సాధిస్తుంది. నేడు పురుషులతో సమానంగా మహిళలు కూడా అన్ని రంగాలలో రాణిస్తున్నారు. ఆర్మీ నుంచి అంతరిక్షం వరకు అన్ని రంగాల్లోనూ వారి పాత్ర విశేషంగా ఉంటోంది. ఒక వైపు కుటుంభ భాద్యతలు మోస్తూనే.. మరో వైపు తాము పని చేస్తున్న రంగాలలో సత్తా చాటుతున్నారు. అయినప్పటి వారి పట్ల వివక్ష కొనసాగుతూనే వుంది. పనిచేసిన చోట తగిన గౌరవం లభించక సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ పరిస్థితి మారాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం

మహిళ్ళపై వివక్ష ఉండకూడదు

సమాజంలో ఎన్ని మార్పులు వస్తున్న మహిళ ల పై వివక్షత పోవడం లేదు. మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, అరాచకాలు పెరిగి పోతున్నాయి. మహిళలపై చూపుతున్న వివక్ష వలన అనేకమంది వారి ప్రతిభను చూపలేక పోతున్నారు. విజయాలను సాధించేందుకు మహిళలకు పూర్తి స్థాయిలో సహకారం ఇవ్వాలి.

కందుకూరి శైలజ, ఉప సర్పంచ్, గన్నవరం, వెటపాక మండలం

చట్టాలు ఉన్న అమలు కావడం

మహిళ చట్టలున్నా వాటిని సారిగ్గా అమలు చేయడం లేదు. రోజు ఎదో ఒక మూలన మహిళలపై, బాలికలపై దాడులు జరుగుతూనే ఉన్నాయి. ప్రభుత్వ కార్యాలయాలలో మహిళలకు సరైన గౌరవం లభించడం లేదు.

ఉబ్బ సుస్మిత, జెడ్పీటీసీ, ఎటపాక.

విద్యతోనే మహిళాభివృద్ధి

ఎన్నో ఏళ్లుగా మహిళ దినోత్సవం జరుపుకుంటున్నప్పటికి మహిళ ల చైతన్యం వ్యాపిస్తున్నప్పటికి మరో వైపుమహిళ ల ప్రగతిని చైతన్యాన్ని అణచి వేస్తున్నారు.అందుకు కారణం పురుషాధీకృత కుటుంబంలో పురుషుడి ఆధిపత్యం స్త్రీలు పురుషులకు లోబడి జీవించాలి. కుటుంబ భాద్యతలు ఆమెను అభివృద్ధి పథంలో సాగనివ్వవు. సంస్థలు తమపై స్థాయి ఉద్యోగులతో పాటు కింది స్థాయి ఉద్యోగులు కూడా మహిళలను వేధించడం, సాధించడం చూస్తుంటే పురుషాధిక్యత స్తాయి మనకు అర్ధమవుతుంది. ఈ పరిస్తితినుండి బయట పడాలంటే సౌకర్యాలను తెలుసుకోవాలి తెలుదుకోకపోవడంతో పాటు అదే అమలు లోకి వచ్చే విధంగా పరస్పర సహకారాన్ని అందించుకోవాలి . సమస్యలు గురించి ధైర్యంగా చెప్పుకో గలగాలి.

కాకా కామేశ్వరీ, ఎంపిపి, ఎటపాక

ఆత్మ స్థైర్యంతో ముందుకు సాగాలి

మహిళలు ఆత్మ స్థైర్యంతో ముందుకు సాగాలి.ఆత్మ విశ్వాసం ఉంటేనే పురుషులతో సమానంగా పనులు చేయ గలుగుతారు. మహిళలు గృహిణీ గా ఉంటూనే చిన్న, చిన్న వ్యాపారాలు చేస్తు అభివృద్ధి చెందాలి.

టి. ఆదిలక్ష్మీ., ఏఎన్ఏం, గన్నవరం

మహిళ పాత్ర అపూర్వం

సమాజంలో అభివృద్ధిలో మహిళ ల పాత్ర ఎంతో కీలకం .కుటుంబంలో పిల్లల చదువులకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. అన్ని కుటుంబాలతో పిల్లలు విద్యా వంతులై మంచి స్థితి లో ఉంటే సమాజం అభివృద్ధి చెందుతుంది.

కాకా పుల్లమ్మ, ఉపాధ్యాయురాలు, చింతల చెరువు

స్త్రీ లేనిదే సృష్టే లేదు

భూదేవి అంత సహనం, రుద్రమ దేవి అంత పరాక్రమం, సీతా దేవి అంతా సౌశీల్యం ఉన్నా నేటి మేటి స్త్రీ.

కృష్ణవేణి, మహిళా పోలీసు గన్నవరం

ప్రతి మహిళ ఉన్నతి చదువులు చదవాలి

మహిళలందరూ అక్షరాస్యులు అయితేనే అభివృద్ధి సాధ్య మవుతుంది. విద్యతోనే మహిళలో చైతన్యం వస్తుంది. మరొకరి పై ఆధార పడకుండా ఉండేందుకు విద్య ఎంతగానో ఉపయోగ పడుతుంది.

టి.రాధ, అంగన్వాడీ సూపర్ వైజర్ ఎటపాక